

ఆశల సాగులో...

వేరుశనగ, పత్తి సాగులో అన్నదాతలు బిజీ

గుత్తిరూరల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): వేరుశనగ సాగులో అన్నదాత లు బిజీబిజీగా మారారు. ఈ నెల 8న మృగశిర కార్తె రావడం, సమయానికి పదును వాన పడటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మృగశిర కార్తెలో పంటలు సాగు చేస్తే మంచి దిగుబడి వస్తుందని రైతుల నమ్మకం. నాలుగు రోజుల కిందట వర్షం రావడంతో రైతులు వేరుశనగ, పత్తి విత్తన సాగులో రైతులు నిమగ్నమయ్యారు. వీటితో పాటు కంది, సజ్జ పంటలు సైతం సాగు చేస్తున్నారు. మండలంలోని గొందిపల్లి, గాజులపల్లి, జక్కలచెరువు, కొత్తపేట, ఊబిచెర్ల, బేతాపల్లి, యంగన్నపల్లి, కొత్తపల్లి, తొండపాడు, శ్రీపురం, తదితర గ్రామాల్లో జోరుగా విత్తన సాగు సాగుతోంది. పెట్టుబడికి చేతిలో చిల్లిగవ్వ లేకపోయినా, అదునుకు పదును కావడంతో అప్పులు చేసి పంటలు సాగు చేస్తున్నారు. మండల వ్యాప్తంగా 18 వేల హెక్టార్లలో సాగుకు సిద్ధంగా ఉన్నారు. ప్రస్తుతం 4 వేల హెక్టార్లలో వేరుశనగ, పంటను సాగు చేస్తున్నారు. పత్తి పంటను వెయ్యి ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఈ ఏడాది వరుణదేవుడిపై భారం ఉంచి పెట్టుబడులు పెడుతున్నామని ఈసారైనా కరుణిస్తే పంట పండి అప్పులు తీర్చుకుంటామని పలువురు రైతులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది మే, జూన్ మాసాల్లో వర్షాలు బాగా కురవడంతో సేద్యాలు చేసి విత్తన సాగుకు భూములు సిద్ధం చేసుకున్నట్లు రైతులు తెలిపారు.

ఎద్దులతో వేరుశనగ విత్తుతున్న రైతు



విత్తన శుద్ధి చేస్తున్న మహిళ

మృగశిరలో సాగుతో మంచి దిగుబడి



నేను ఐదు ఎకరాల్లో వేరుశనగను మృగశిర కార్తెలోనే సాగు చేశా. ఈ కార్తెలో పంట సాగు చేస్తే పైరు బలంగా వచ్చి మంచి దిగుబడి వస్తుంది. ఈ ఏడాదైనా పంట పండకపోదా అని సాగు చేశా.

-గోపీనాథ్ చౌదరి, ధర్మాపురం

పత్తి, వేరుశనగ విత్తుతున్నా



దేవుడి మీద భారం వేసి మంచి అదునులో వేరుశనగ సాగు చేస్తున్నా. ప్రతి ఏడాది జూన్ మాసంలో సాగు చేస్తా. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురిసి వేరుశనగ, పత్తి మంచి దిగుబడి వస్తుందని పంటలు సాగు చేశా.

-నాగేష్, జక్కలచెరువు రైతు

కసాపురంలో ఘనంగా

వెండి రథోత్సవం

గుంతకల్లు టౌన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో వెండి రథోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో వెండి రథాన్ని లాగి ఉత్సవాన్ని ముగించారు. కార్యక్రమంలో వేద పండితులు అర్చకులు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో ఉత్సవ మూర్తులు

గోశాల నిర్మాణానికి భూమి పూజ

నెట్టికంటి దేవాలయం సర్వే నంబరు 183లో 75-75 అడుగుల కొలతలతో గోశాల నిర్మాణానికి శనివారం భూమి పూజ చేశారు. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లాకు చెందిన పట్టినాగులపల్లి గ్రామాని చెందిన భక్తుడు పరమేశ్వర్‌సింగ్ కోటి రూపాయలతో ఈ గోశాలను నిర్మించనున్నారు. కర్నూల్ జిల్లా సుబ్రహ్మణ్యం స్తపతి, దేవదాయ శాఖ వారు వాస్తు ప్రకారం మార్కింగ్ వేయించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కే వాణి, ఆలయ సహాయ కార్యనిర్వాహక అధికారి వెంకటేశ్వరుడు, పర్యవేక్షకులు వెంకటేశులు, ఆలయ సిబ్బంది తదిరులు పాల్గొన్నారు.

కంపించిన ఇళ్లు..

భయపడ్డ ప్రజలు 7



వ్యవసాయ మార్కెట్‌యార్డు

దండిగా ఆదాయం..!

అనంత మార్కెట్ యార్డులో పశువుల సంతకు ఆదరణ

ఏడాదిలో రూ.2.06 కోట్ల రాబడి

మార్కెట్ ఫీజు లక్ష్యానికి దోహదం

అనంతపురంరూరల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్‌కు పశువుల సంత ద్వారా ఆదాయం పెరుగుతోంది. మార్కెట్ ఫీజు లక్ష్యానికి దోహదపడుతోంది. మార్కెట్‌కు చీనీ మార్కెట్, పశువుల సంతే ఆదాయ వనరులు. మార్కెట్‌లోని గదులకు సంబంధించిన బాడుగలు ఉన్నప్పటికీ పెద్దగా ఆదాయం రాలేదు. ఉన్న ఈ రెండు వసరులే ఏటా మార్కెట్‌కు రూ.కోట్లలో తెచ్చిపెడుతున్నాయి. సీజన్‌తో సంబంధం లేకుండా ఆదాయం తెస్తున్నాయి. గత ఏడాది పశువుల ద్వారా రూ.2.06 కోట్లు ఖజానా వచ్చి చేరింది. దీన్ని బట్టి పశువుల సంత నుంచి ఆదాయం ఏమేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి గొర్రెలు, మేకల సంత ద్వారా రూ20.41 లక్షలు, ఎద్దులు, ఎనుముల సంత ద్వారా రూ.14.57 లక్షలు మార్కెట్‌కు సమకూరింది.

సంవత్సరం	గొర్రెలు,మేకల సంత ఆదాయం రూ.	ఎద్దులు, ఎనుముల సంత ఆదాయం రూ.	రెండింటి ఆదాయం రూ.
2020-21	48,22,525	21,23,025	69,45,550
2021-22	85,86,520	59,19,330	1,45,05,850
2022-23	98,73,644	41,67,820	1,40,41,464
2023-24	1,05,16,170	90,53,770	1,95,69,940
2024-25	1,14,31,135	92,00,770	2,06,31,905

ఐదేళ్లలో రూ.7.56 కోట్లు..

ప్రతి శని, ఆదివారాల్లో పశువుల సంత జరుగుతుంది. శనివారం గొర్రెలు, మేకల సంత నిర్వహిస్తారు. ఆదివారం ఎద్దులు, ఎనుముల సంత ఉంటుంది. సంతకు ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు, వ్యాపారులు వస్తుంటారు. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ తదితర రాష్ట్రాల నుంచి కూడా వ్యాపారులు వస్తారు. ఈక్రమంలో అనంత వ్యవసాయ మార్కెట్ ఇతర ప్రాంతాల్లోనూ పేరొందింది. మార్కెట్ యార్డుకు ఏటా పశువుల సంత నుంచి (మిగతా 7లో..)

నీట్‌గా మెరిశారు

సత్తా చాటిన ఉమ్మడి జిల్లా విద్యార్థులు

ఆయా కుటుంబాల్లో వెల్లివిరిసిన సంబరం



ధనుష్

అనంతపురం టౌన్/ సెంట్రల్/హిందూపురం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): నీట్-2025 (నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రెన్స్ టెస్ట్)లో అనంత విద్యార్థులు సత్తా చాటారు. దేశవ్యాప్తంగా 23లక్షల మందికిపైగా విద్యార్థులు ఈపరీక్షలు రాయగా, ఫలితాలు శనివారం విడుదల చేశారు. ఇందులో జిల్లాకు చెందిన విద్యార్థులు మెరుగైన ర్యాంకులు సాధించారు.

పురం విద్యార్థికి 103వ ర్యాంకు

దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ ఫలితాల్లో హిందూపురం విద్యార్థి ధనుష్ సత్తాచాటాడు. ఏకంగా ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 103వ ర్యాంకు సాధించాడు. పట్టణానికి చెందిన (మిగతా 7లో...)

యోగాతో మీ ఆరోగ్యం

మీ చేతుల్లో...

జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్

ఘనంగా దివ్యాంగుల రాష్ట్రస్థాయి యోగాంధ్ర



యోగాసనాలు వేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): యోగా ద్వారా మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే ఉంటుందని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో రాష్ట్రస్థాయి దివ్యాంగుల యోగాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోజూ యోగాను చేస్తే అనేక ఆరోగ్య సమస్యలు దూరమవుతా యన్నారు. ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి వరల్డ్ రికార్డు సృష్టించబోతున్నామని సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 21న ఆర్డీటీ స్టేడియంలో 5వేల మందితో అంతర్జాతీయ యోగాదినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి దివ్యాంగుల యోగాంధ్ర విజయవంతం చేయడం సంతోషంగా ఉందన్నారు. పలువురు దివ్యాంగులను, యోగా గురువులను సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కమలమ్మ, రజక కార్పొరేషన్ డైరెక్టర్ పరమేశ్వర్, జిల్లా అధికారులు, దివ్యాంగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యోగా గురువులు తదితరులు పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న దివ్యాంగులు

పనితీరుపై

నిఘా!

వైద్య సేవలపై ప్రభుత్వం ఐవీఆర్ఎస్ సర్వే



జిల్లా ఆస్పత్రిలో పేషెంట్లు

• అసంతృప్తి వ్యక్తంచేస్తున్న రోగులు • ఆస్పత్రులను తనిఖీ చేస్తున్న కలెక్టర్

అనంతపురంటౌన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిఘా పెట్టింది. నిరంతరం వాస్తవాలు తెలుసుకోవడానికి ఐవీఆర్ఎస్ సర్వే కొనసాగిస్తోంది. ఆస్పత్రులకు వచ్చి వైద్యసేవలు పొందుతున్న రోగులతో నేరుగా సీఎంఓ నుంచి ఐవీఆర్ఎస్ ద్వారా ఆస్పత్రులలో అందిన సేవలు గురించి ఆరా తీస్తున్నారు. జిల్లా సర్వజన ఆస్పత్రితో పాటు 12సీహెచ్‌సీలు, 44పీహెచ్‌సీలో ఐవీఆర్ఎస్ ద్వారా సమాచారం తీసుకుంటున్నారు.

కలెక్టర్ ప్రత్యేక దృష్టి

ప్రభుత్వ ఆస్పత్రుల పనితీరుపై రోగులు, ప్రజల నుంచి వ్యతిరేక భావాలు వస్తుండటంతో జిల్లా కలెక్టరు వినోద్‌కుమార్ ప్రత్యేక దృష్టిపెట్టారు. ప్రతివారం వైద్యశాఖల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహిస్తూ ఐవీఆర్ఎస్ సర్వేలో ఎక్కడెక్కడ ఏఏ ఆస్పత్రులలో రోగుల నుంచి ఏఏ అంశాలపై అసంతృప్తి వ్యక్తం అయ్యిందో చెబుతున్నారు. అదే సమయంలోనే ఆస్పత్రుల పనితీరు మెరుగుపరచడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో వైద్యాధికారులకు సూచిస్తున్నారు. మరోపక్క ఆస్పత్రులను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నారు. పది రోజుల కిందట గుంతకల్లు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి అర్ధరాత్రి సమయంలో సాధారణ వ్యక్తిగా వెళ్లి అన్ని విభాగాలను పరిశీలిస్తూ ఆరా తీశారు. అలాగే పామిడి, గుత్తి, తాడిపత్రి, సూపర్ స్పెషాలిటీ, జిల్లా ఆస్పత్రి ఇలా అనేక ఆస్పత్రులకు వెళ్లి తనిఖీ చేస్తున్నారు. పీహెచ్‌సీలలో పని చేస్తున్న డాక్టర్లను కలెక్టరేట్‌కు పిలిపించుకొని సమావేశం ఏర్పాటు చేసి వారి పనితీరుపై ఇటీవల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలా ప్రభుత్వం, కలెక్టర్ వైద్య సేవలు మెరుగు పరచడానికి తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఈక్రమంలో ఎప్పుడు ఎవరిపై వేటు పడుతుందోనని డాక్టర్లు, సిబ్బందిలో తీవ్ర ఆందోళన మొదలైంది.



ఇటీవల కలెక్టరు నిర్వహించిన సమావేశానికి హాజరైన పీహెచ్‌సీల డాక్టర్లు



రోగుల అసంతృప్తి

ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చి వైద్యసేవలు పొందిన వారిని ఐవీఆర్ఎస్ సర్వేలో పలు ప్రశ్నలు అడిగి వాస్తవాలు రాబడుతున్నారు. ప్రధానంగా మీరు వెళ్లినపుడు డాక్టర్లు, వైద్యసిబ్బంది ఉన్నారా? డాక్టర్లు మిమ్మల్ని పరీక్షించారా? మీతో డాక్టర్లు, సిబ్బంది మంచిగా, గౌరవంగా మాట్లాడా రా? ఉచితంగా మందులు ఇచ్చారా? బయటతెచ్చుకోమని రాసిచ్చారా? స్కానింగ్‌లు ఏమైనా తీశారా? బయటకు పంపించారా? ఆస్పత్రిలో పరిశుభ్రత ఎలా ఉంది? అడ్మిషన్ పేషెంట్లకు మంచిగా భోజనం పెడుతున్నారా? వంటి ప్రశ్నలు వేసి సమాధానాలు రాబడుతున్నారు. ఈసర్వేలో ఆస్పత్రుల పనితీరు పట్ల అధికశాతం మంది అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రతి అంశంలోనూ 50శాతం వరకు రోగుల నుంచి అసంతృప్తి వ్యక్తమయినట్లు ఐవీఆర్ఎస్ సర్వే నివేదికలు చూపుతున్నాయి. దీంతో సీఎంతోపాటు సంబంధితశాఖామంత్రి, వైద్యశాఖల రాష్ట్ర ఉన్నతాధికారులు ఆస్పత్రులలో పనితీరును మెరుగుపరచడానికి అనేక ప్రయత్నాలు చేస్తున్నారు.

అర్హులందరికీ 'తల్లికి వందనం'

కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, జూన్14 (ఆంధ్రజ్యోతి): ఒకటో తరతగతి నుంచి ఇంటర్‌మీడియట్ వరకు చదువుతున్న ప్రతి అర్హత కలిగిన విద్యార్థికి తల్లికి వందనం పథకం వర్తింపజేస్తామని కలెక్టర్ వినోద్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. విద్యార్థుల చదువులు నిరాటంకంగా కొనసాగడానికి రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని చేపట్టిందన్నారు. ఈ పథకం కింద అర్హులైన విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలకు రూ.13వేలు ప్రతి ఏటా జమ చేస్తారన్నారు. అర్హత ఉండి, పథకం రాకపోతే అలాంటి వారు సచివాలయాల్లో ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ప్రతి కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉన్నా అందరికీ డబ్బులు జమ చేస్తారని తెలిపారు. అభ్యంతరాలను ఈనెల 20లోగా అందిస్తే వాటిని సచివాలయ సిబ్బంది పరిశీలించి 28లోగా అనుబంధ జాబితాను తయారు చేసి అర్హులకు న్యాయం చేస్తారని వెల్లడించారు. 1వ తరగతి, ఇంటర్ విద్యార్థుల వివరాలను సమాచార నిమిత్తం ఈనెల 30లోగా సచివాలయాల్లోని నోటీస్‌బోర్డులో ఉంచుతామన్నారు. అభ్యంత రాల పరిశీలన అనంతరం అర్హులైన వారందరికీ జూలై 5న డబ్బులు జమ చేస్తారని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరంలేదని కలెక్టరు వెల్లడించారు.

ఎమ్మెల్యే అమిలినేనికి అవార్డు

మంత్రి చేతుల మీదుగా అందుకున్న తనయుడు



మంత్రి సత్యకుమార్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఎమ్మెల్యే కుమారుడు అమిలినేని యశ్వంత్

కళ్యాణదుర్గం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): తన తండ్రికి లభించిన గవర్నర్ అవార్డును ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తనయుడు అమిలినేని యశ్వంత్ రాష్ట్ర వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ చేతుల మీదుగా అందుకున్నాడు. రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గుంటూరు లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమారుడు యశ్వంత్‌కు గవర్నర్ అవార్డును అందజేశారు. ఎమ్మెల్యే అమిలినేని పుట్టిన రోజు సందర్భంగా సుమారు 5000 యూనిట్లకు పైబడి రక్తదానం చేయడంతో ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఎస్ఆర్‌సీ ట్రస్ట్ ఆధ్వర్యంలో కళ్యాణదుర్గంలోని ప్రజావేదిక వద్ద రక్తదాన శిబిరం, బెంగళూరు, హాసన్, తాడిపత్రి రోడ్డులోని హ్యాంప్ ప్రాజెక్టు, అనంతపురంతో పాటు మిగిలిన ప్రాంతాల్లో పెద్ద ఎత్తున రక్తదాన శిబిరాలు నిర్వహించారు. తద్వారా 5000 యూనిట్లకు పైబడిన రక్తం సేకరించారు. దీంతో ఆయన్ను రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర గవర్నర్ అవార్డుకు ఎంపిక చేసింది.

ప్రేమ పెళ్లి చేసుకుందని...

• కుమార్తెను కిడ్నాప్ చేసిన తల్లిదండ్రులు

7

ఒకటే జాయినింగ్ తేదీ ఇవ్వాలి..

• 2012 డీఎస్సీ టీచర్లకు న్యాయం చేయాలి

• యూటీఎఫ్ నాయకుల డిమాండ్

7

ప్రేమ పెళ్లి చేసుకుందని...

కుమార్తెను కిడ్నాప్ చేసిన తల్లిదండ్రులు

కళ్యాణదుర్గం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పెళ్లి చేసుకుందని కన్న కూతురినే తల్లిదండ్రులు కిడ్నాప్ చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. బెళుగుప్ప మండలం తగ్గుపర్తికి చెందిన ఉపాధ్యాయురాలు అదే గ్రామానికి చెందిన వ్యక్తిని ప్రేమించి గత నెలలో వివాహం చేసుకున్నారు. దీన్ని ఆమె తల్లిదండ్రులు అంగీకరించలేదు. ఎలాగైనా భర్త నుంచి ఆమెను వేరు చేయాలని భావించారు. ఈ క్రమంలోనే ఈనెల 12న ఆమె విధులు నిర్వహించే కంబదూరు మండలంలోని కురాకులపల్లి ప్రభుత్వ పాఠశాల వద్దకు చేరుకుని కాపుకాశారు. ఇది తెలియని ఉపాధ్యాయురాలు భర్తతో కలిసి ద్విచక్రవాహనంపై పాఠశాలకు వచ్చారు. అప్పటికే అక్కడ కాపుగాసిన తల్లిదండ్రులు భర్తను తోసేసి కుమార్తెను బలవంతంగా వాహనంలో ఎక్కించుకుని తీసుకెళ్లారు. ఈ విషయమై అదేరోజు టీచర్ భర్త కంబదూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఈ నెల 13 న కేసు నమోదు చేశారు. కంబదూరు, కళ్యాణదుర్గం పరిధిలోని పోలీసులు 10 మంది బృందంగా ఏర్పడి టీచర్ ఆచూకీ కోసం గాలించారు. బెంగళూరు పరిసర ప్రాంతంలో టీచర్ ఆచూకీ లభ్యమైన ట్లు సమాచారం. టీచర్‌ను ఆస్తి కోసమా లేక వ్యక్తిగత కారణాలతో కిడ్నాప్ చేశారా అనే వివరాలు తెలియాల్సి ఉంది. టీచర్‌ను కిడ్నాప్ చేసిన దుండగులు కూడా పోలీసులు అదుపులో ఉన్నట్లు సమాచారం. కంబదూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనాలు ఢీ

ఒకరి మృతి, మరొకరికి తీవ్రగాయాలు

గోరంట్ల, జూన్14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హిందూపురం ప్రధాన రహదారిలో హెచ్‌పి పెట్రోల్ బంక్ వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని బూగానిపల్లికి చెందిన నంజుండప్ప గోరంట్లకు ద్విచక్రవాహనంలో వస్తుండగా ముద్దలకుంటపల్లికి చెందిన ప్రకాష్ ద్విచక్రవాహనంలో వస్తున్నాడు. వీరి వాహనాలు ఎదురెదురుగా గోరంట్ల పెట్రోలు బంకు సమీపంలోకి ఢీకొన్నాయి. దీంతో నంజుండప్ప(52) అక్కడికక్కడే మృతిచెందగా ప్రకాష్‌కు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ప్రకాష్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. సీఐ శేఖర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాస్ కాలేదని యువతి ఆత్మహత్య

అనంతపురం క్రైం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఫెయిల్ అయిన సబ్జెక్టులు మూడేళ్లుగా రాస్తున్నా పాస్ కాకపోవడంతో మనస్తాపం చెందిన ఓ యువతి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు నగరంలోని అశోక్‌నగర్ రెండో క్రాస్‌కు చెందిన నాగలింగయ్య, లక్ష్మీదేవి దంపతులకు నలుగురు కుమార్తెలు. లక్ష్మీదేవి 2015లో మృతి చెందింది. చివరి కుమార్తె సునీత(25) మదనపల్లి మిట్స్ కళాశాలలో మూడేళ్ల కిందట బీటెక్ చదివింది. కొన్ని సబ్జెక్టులు ఫెయిల్ కావడంతో వాటిని రాస్తూ వస్తోంది. అయినా ఫలితం లేదు. ఈ క్రమంలో గత కొంతకాలంగా తనతో పాటు చదివిన విద్యార్థులు చదువులో, ఉద్యోగాలతో ముందుకెళ్లారని, తాను మాత్రం ఉన్న చోటే ఉన్నానని బాధపడేది. చీనీకాయల వ్యాపారం చేసే నాగలింగయ్య శుక్రవారం ఉదయం బయటకు వెళ్లాడు. ఇంట్లో సునీత, మానసిక స్థితి సరిగా లేని ఆమె అక్క మాత్రమే ఉన్నారు. మధ్యాహ్న సమయంలో సునీత తన ఇంట్లోని ఓ గదిలో ఉరివేసుకుంది. శుక్రవారం రాత్రి ఇంటికొచ్చిన నాగలింగయ్య ఉరికి వేలాడుతున్న కుమార్తెను చూసి కన్నీరు మున్నీరయ్యాడు. ఈ ఘటనపై వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.
కంకర మెషీన్‌లో భారీ పేలుళ్లు

కంపించిన ఇళ్లు.. భయపడ్డ ప్రజలు

కళ్యాణదుర్గం, జూన్14(ఆంధ్రజ్యోతి): కళ్యాణదుర్గం పరిసర ప్రాంతంలో దేవేంద్రపురం వద్ద ఉన్న కంకర్‌మెషీన్‌లో శుక్రవారం సాయంత్రం జరిగిన పేలుళ్ల ధాటికి ఆ ప్రాంత ప్రజలందరూ భయభ్రాంతులకు గురయ్యారు. భారీ శబ్దానికి ఇళ్లన్నీ కంపించిపోయాయి. దేవేంద్రపురంతో పాటు పలు గ్రామాల పరిధి వరకు ఆ భీకర శబ్దం వినిపించింది. ఈ కంకర మెషీన్‌లో ప్రతిసారి ఇలాగే భయంకరమైన పేలుళ్లు జరుగుతున్నప్పటికీ ఏ ఒక్క అధికారి స్పందించలేదని గ్రామస్థులు వాపోతున్నారు. కళ్యాణదుర్గానికి వెళ్లే ప్రధాన రహదారిలోనే ఈ కంకర మెషీన్ క్వారీ ఉన్నప్పటికీ ఇక్కడ నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా పనులు చేస్తున్నా ఏ ఒక్కరూ పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఈ కంకర మెషీన్‌లో పేలుళ్లను అరికట్టాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.

మతపెద్ద పరారీ..

గాలిస్తున్న పోలీసులు

అనంతపురం క్రైం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): బాలికను గర్భవతిని చేసిన ఓ మతపెద్ద పరారయ్యాడు. అనంతపురం రూరల్ మండల పరిధిలోని నారాయణపురానికి చెందిన మహమ్మద్ ఫయాజ్ మత పెద్దగా ఉంటున్నాడు. పిల్లలు లేని ఇతను తన బావమరిది కుమార్తెను పెంచుకుంటున్నాడు. ఆ చిన్నారిని చూసుకోవడానికి తన బంధువుల ఇంట్లో ఉంటున్న ఓ బాలికను పిలిపించాడు. గత కొంతకాలంగా ఆ బాలికకు మాయమాటలు చెప్పి శారరీకంగా వాడుకున్నాడు. భయ పెట్టడంతో ఆ బాలిక ఈ విషయాన్ని ఎవరికీ చెప్పలేదు.

కడుపునొప్పితో ఆసుపత్రికి వెళ్తే..

కొన్ని నెలలుగా నెలసరి రాకపోవడంతో భయపడిన బాలిక తల్లికి విషయం చెప్పింది. మూడు రోజుల కిందట తల్లి ఆ ఇంటికి వచ్చింది. కడుపునొప్పిగా ఉందని ఆసుపత్రికి తీసుకెళ్తామని బాలిక తల్లి ఫయాజ్‌తో చెప్పింది. దీంతో ఆమెపై మండిపడ్డాడు. 'నేనే చూపిస్తాను కదా నీకెందుకు ఊరెళ్లిపో' అన్నాడు. అలా రెండ్రోజులు బుకాయించాడు. కానీ మూడోరోజు బాలిక తల్లి కమలానగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి బాలిక గర్భం దాల్చినట్లు నిర్ధారించారు. దీంతో అబార్షన్ చేయమని అడగ్గా అక్కడి వైద్యురాలు తాము చేయ లేమని చెప్పారు. పోలీసులకు సమాచారం అందించకుండా ప్రభుత్వాసుపత్రికి రెఫర్ చేశారు. ప్రభుత్వాసుపత్రికి బాలికను తీసుకెళ్లగానే మహిళా పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. పోలీసులు రంగంలోకి దిగగానే ఫయాజ్ పరారయ్యాడు. పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలిస్తున్నారు.

దండిగా ఆదాయం..!


సంతలో గొర్రెలు, మేకలు

(5వ పేజీ తరువాయి)

ఆదాయం పెరుగుతోంది. గత ఐదేళ్లలో రూ.7.56 కోట్ల ఆదాయం ఖజానాకు చేరింది. గత ఏడాది ఒక్కటే రూ.2.06 కోట్లు సంత రూపంలో వచ్చింది.

గొర్రెలు, మేకల సంతతో అధిక ఆదాయం

మార్కెట్‌లోని పశువుల సంత ద్వారా వచ్చే ఆదాయంలో.. గొర్రెలు, మేకల సంత ద్వారానే ఎక్కువగా సమకూరుతోంది. గడిచిన ఐదేళ్లలో ఎద్దులు, ఎనుముల సంత ద్వారా రూ3.04 కోట్లు, గొర్రెలు, మేకల సంతతో రూ.4.52 కోట్ల ఆదాయం వచ్చింది. 2020-21 ఆర్థిక సంవత్సరంలో మాత్రమే కొంత తగ్గింది. కరోనా నేపథ్యంలో మార్కెట్‌ను ఏడు నెలలు మూసేశారు. ఈక్రమంలో రూ.69.45లక్షలు మాత్రమే ఆదాయం వచ్చింది. మళ్లీ 2022-23లో లంపీ వ్యాధి ప్రబలిన నేపథ్యంలో నాలుగు నెలల పాటు ఎద్దులు, ఎనుముల సంతను బంద్ చేశారు. ఆ ఏడు కొంత ఆదాయం తగ్గింది. ఈ రెండు మినహా.. మిగిలిన ప్రతి ఏటా ఆదాయం ఆశాజనకంగా ఉంది.

ఆదాయం మరింత పెంచేందుకు చర్యలు



ప్రస్తుతం పశువుల సంత ద్వారా మార్కెట్‌కు ఆదాయం బాగానే ఉంది. ఈ క్రమంలో మార్కెట్‌లో మరిన్ని వసతులు కల్పించి, మరింత ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పశువుల సంత నిర్వహణకు స్థలం సమస్య ఏర్పడింది. సంత జరిగే ప్రాంతంలో దెబ్బతిన్న నాలుగు గోదాములు ఉన్నాయి. అవి నిల్వలకు ఉపయోగ పడే పరిస్థితి లేదు. ఈ క్రమంలో గోడలను తొలగించి పశువులకు వినియోగించాలని నిర్ణయించాం. ఆ మేరకు ఉన్నతాధికారులకు నివేదించాం.

-గోవిందు, మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి

తమ్ముడిని హత్య చేసిన అన్న


నడిపి కంబగిరి (ఫైల్)

పుట్లూరు, జూన్14(ఆంధ్రజ్యోతి): ఆస్తి తగాదాలతో తమ్ముడిని సొంత అన్నే గొంతు కోసి, హత్య చేశాడు. అనంతపురం జిల్లా పుట్లూరు మండల కేంద్రంలో శనివారం తెల్లవారుజామున తలారి నడిపి కంబగిరి (40)ని అతడి అన్న పెద్ద కంబగిరి చంపేశాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెద్ద కంబగిరి, నడిపి కంబగిరి, చిన్నకంబగిరి అన్నదమ్ములు. వీరికి పుట్లూరులో మూడు సెంట్లలో ఇల్లు ఉంది. నడిపి కంబగిరి అనంతపురం జిల్లా తాడిపత్రిలోని నందలపాడుకు కొన్నేళ్ల క్రితం వెళ్లి, అక్కడే స్థిరపడ్డాడు. అప్పుడప్పుడూ స్వగ్రామానికి వచ్చి వెళ్తుండేవాడు. పుట్లూరులోని ఇంట్లో పెద్దకంబగిరి తన భార్య కోసం చిన్నగది కట్టించాడు. దీనిపై నడిపి కంబగిరి గొడవ పడేవాడు. ఇల్లు తన భార్య పేరున రాయించాలంటూ అన్నపై ఒత్తిడి తెచ్చేవాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం స్వగ్రామానికి వచ్చిన నడిపి కంబగిరి రాత్రి అన్నతో గొడవ పడ్డాడు. పోలీసులు వచ్చి ఇద్దరికీ సర్దిచెప్పారు. అయినా దీనిని భరించలేక నడిపి కంబగిరి రాత్రికి ఆ ఇంట్లోనే నడిపి కంబగిరి పడుకున్నాడు. గొడవ నేపథ్యంలో ఆవేశానికి లోనైన పెద్దకంబగిరి కత్తితో నిద్రిస్తున్న తమ్ముడి గొంతుకోశాడు. అతడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. అనంతరం నిందితుడు నేరుగా పోలీసు స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయినట్లు సమాచారం. నడిపి కంబగిరి భార్య నారాయణమ్మకు మతిస్థిమితంగా లేదు. పిల్లలు లేరు. హత్యాస్థలాన్ని సీఐ సత్యబాబు, ఎస్ఐ వెంకటనరసింహులు పరిశీలించారు. కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నీట్‌గా మెరిశారు

(5వ పేజీ తరువాయి)

చింతపండు వ్యాపారి రాజేష్, రేణుకాంబ దంపతుల పెద్దకుమారుడు ధనుష్ ఎల్‌కేజీ నుంచి 2వ తరగతి వరకు పట్టణంలోని చిన్మయ పాఠశాలలో చదివాడు. 3 నుంచి పదో తరగతి వరకు చైతన్య పాఠశాలలో చదివాడు. ఇంటర్ వయూర్ విశ్వశాంతి కళాశాలలో చదివాడు. మొదటిసారి నీట్ రాసినపుడు ర్యాంకు తక్కువ రావడంతో మరోసారి ప్రయత్నించాడు. ఈ ప్రయత్నంలో 645 మార్కులు సాధించి జాతీయస్థాయిలో 103వ ర్యాంకు సాధించాడు. ఇంటి వద్దే స్వయంగా చదివాడని తల్లిదండ్రులు తెలిపారు.

న్యూరో ఫిజిషియన్ అవుతా: సైనారెడ్డి, 866వ ర్యాంకు



మా నాన్న నరసింహారెడ్డి శింగనమల నియోజకవర్గం పెరవలి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. అమ్మ బుక్క రాయసముద్రం ఐసీడీఎస్ క్లస్టర్‌లో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నారు. నా కష్టానికి ఫలితంగా నీట్‌లో జాతీయస్థాయిలో 866వ ర్యాంకు వచ్చింది. దీంతో మా కుటుంబంలో పండుగ వాతావరణం నెలకొంది. ఎయిమ్స్‌లో సీటు సాధించి, అక్కడే న్యూరోఫిజిషియన్ చేయాలన్నదే నా లక్ష్యం.

ఎయిమ్స్‌లో సీటే లక్ష్యం: తరుణ్‌తేజ్, 1054వ ర్యాంకు



నాకు నీట్‌లో 1054వ ర్యాంకు వచ్చింది. మానాన్న తిమ్మారెడ్డి ధర్మవరం రూరల్ చిగిచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పని చేస్తున్నారు. మా అమ్మ లత గృహిణి. జాతీయ స్థాయిలో మెరుగైన ర్యాంకు రావడం ఆనందంగా ఉంది. ఎయిమ్స్‌లో సీటు సాధించడమే నా లక్ష్యం. ఆ తర్వాతనే ఏకోర్సు అనే నిర్ణయించుకుంటా.

న్యూరో సర్జన్ అవుతా: చేతన్‌రెడ్డి, 1615వ ర్యాంకు



మానాన్న భిక్షమ్‌రెడ్డి అనంతపురంలో వ్యాపారం చేస్తారు. అమ్మ సునీత గృహిణి. పదో తరగతి వరకు అనంతపురం శ్రీచైతన్యలో, ఇంటర్ హైదరాబాద్ శ్రీచైతన్యలోను చదివా. ఇంటర్ మొదటి సంవత్సరం నుంచే నీట్ లక్ష్యంగా చదివా. న్యూరోసర్జన్ చేసి మంచి డాక్టరుగా ప్రజలకు సేవలందిస్తా.

కార్డియాలజిస్టుగా సేవలందిస్తా: శశాంక్, 1747వ ర్యాంకు



కార్డియాలజిస్టుగా ప్రజలకు సేవలందించాలన్నదే నా లక్ష్యం. మానాన్న విశ్వనాథ్ చౌదరి ట్రాన్స్‌కోలో విజిలెన్స్ విభాగంలో సీఐగా పని చేస్తున్నారు. అమ్మ గృహిణి. నాకు నీట్‌లో 1747 ర్యాంకు వచ్చింది. దీంతో మా కుటుంబంలో సంతోషం నెలకొంది. మంచి హృద్రోగ నిపుణుడిగా ఎదిగి పేదలకు సాధ్యమైనంత సేవ చేస్తా.

తల్లిదండ్రుల ఆశయం నెరవేర్చాలనే..:

అభినవ్‌రెడ్డి, 4889వ ర్యాంకు



మా నాన్న నిరంజన్‌రెడ్డి సాయినగర్‌లో మెడికల్ షాపు నిర్వహిస్తున్నారు. అమ్మ జేఎన్‌టీయూలో ఫార్మసిస్టుగా పనిచేస్తున్నారు. నేను చిన్నప్పటి నుంచి డాక్టర్ కావాలని మా అమ్మా నాన్న కోరుకునేవారు. వారి ఆశయం నెరువేర్చాలనే కష్టపడి చదివి నీట్‌లో ర్యాంకు సాధించా. ఎంబీబీఎస్‌లో మంచిగా చదివి మంచి ర్యాంకు సాధిస్తా. కార్డియాలజీ స్థిరపడి పేదలకు వైద్యసేవలందిస్తా.

కష్టపడితేనే...: త్రివిక్రమ్, 222వ ర్యాంకు



జీవితంలో ఎంచుకున్న రంగంలో రాణించాలంటే కష్టపడి చదవాల్సిందే. నవజాత శిశువు నుంచి వృద్ధుల వరకు ఏదో ఒక అనారోగ్యం వెంటాడుతోంది. ఈ సమస్యకు పరిష్కారం చూపేలా వైద్యరంగంలో మార్పులు తీసుకురావడమే లక్ష్యంగా పెట్టుకున్నా. మంచి ఎయిమ్స్ కాలేజ్‌లో ఎంబీబీఎస్ సీటు వస్తుంది. అమ్మ చంద్రకళ గృహిణి. నాన్న రెడ్డప్ప, ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా నల్లచెరువు మండలం గోరంట్లవారిపల్లిలో పనిచేస్తున్నారు.

మెడికల్ రీసెర్చ్ సైంటిస్ట్ కావడమే లక్ష్యం:

అశుతోష్, 765వ ర్యాంకు



మెడికల్ రీసెర్చ్ సైంటిస్ట్‌గా పని చేయాలని లక్ష్యాన్ని పెట్టుకున్నా. దీర్ఘకాలిక వ్యాధులకు పరిష్కారం చూపి, బాధితుల ఆయుష్షును పెంచేలా కృషి చేస్తా. ఎయిమ్స్ భువనేశ్వర్‌లో ఎంబీబీఎస్ సీటువస్తుందని అనుకుంటున్నా. మాది జనార్ధనపల్లి, విడపనకల్లు మండలం. అమ్మ శ్రీవాణి ప్రైవేట్ టీచర్‌గా పని చేసేవారు. నాన్న రాము, బెంగళూరులో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నారు.

గుమాస్తా కొడుకు డాక్టర్: సుధీర్‌కుమార్, 1500వ ర్యాంకు



డాక్టర్‌గా పేద ప్రజలకు సేవ చేయాలన్నదే లక్ష్యం. మాది తాడిపత్రి మండలం భోగసముద్రం. అమ్మ హేమావతి, గృహిణి. నాన్న బండల ఫ్యాక్టరీలో గుమాస్తాగా పని చేస్తున్నారు. బండల ఫ్యాక్టరీ యజమాని యాతం రాజశేఖర్‌రెడ్డి సాయంతో నీట్‌లో 1500వ ర్యాంక్ సాధించా. ఆయన సాయం ఎప్పటికి మరువలేనిది.

ప్రభుత్వ వైద్యుడిగా..: వికాస్, 5000వ ర్యాంకు



ప్రభుత్వ వైద్యుడిగా ఉద్యోగం చేయాలన్నది మా అమ్మ, నాన్న ఆకాంక్ష. వారి ఆశలను నెరవేర్చేలా కష్టపడి చదివి మంచి ర్యాంకు సాధించా. ఈఏపీసెట్‌లోనూ స్టేట్ 161వ ర్యాంకు వచ్చింది. ఎంబీబీఎస్‌కు ఎయిమ్స్ మెడికల్ కళాశాలలో సీటువచ్చే అవకాశముంది. మాది అనంతపురం, అమ్మ ఆదిలక్ష్మి గృహిణి. నాన్న కొండపనాయుడు, వ్యాపారం చేస్తారు.

కార్డియాలజీ చదువుతా: హర్షిణి, 57,200వ ర్యాంకు



ఎంబీబీఎస్ పూర్తిచేసి పీజీలో కార్డియాలజీ చేయలనుకున్నా. ఎంబీబీఎస్‌లో నెల్లూరు, నంద్యాల, తిరుపతిలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటురావచ్చు. నీట్‌లో ఫిజిక్స్ సబ్జెక్టులో జవాబు తెలియని వాటికి కూడా ఆప్షన్ పెట్టా. దీంతో మైనస్ మార్కులు పెరిగాయి. అమ్మ చంద్రకళ, గృహిణి. నాన్న మునిరెడ్డి, ఆర్‌ఎంపీగా పనిచేస్తున్నారు.

జనరల్ సర్జన్ అవుతా: నిషితారెడ్డి, 7253వర్యాంకు



పీజీలో జనరల్ సర్జన్ చేయాలని అమ్మానాన్న ఆశయం. వారి కలలను సాకారం చేసేలా నీట్‌లో మంచి మార్కులు సాధించా. గ్రామీణ ప్రాంత ప్రజలు ప్రత్యేక డాక్టర్ వద్దకు వెళ్లాలంటే ఇబ్బంది పడతారు. వారి ఇబ్బందులు తీరేలా వైద్య సేవ చేస్తా. మాది పెద్దపప్పూరు మండలం, పెద్దఎక్కలూరు. అమ్మ వరలక్ష్మి, గృహిణి, నాన్న మురళీమోహన్‌రెడ్డి వ్యవసాయం చేస్తారు.

శిలాఫలకం ధ్వంసం


వీరన్నగట్టుపల్లి వద్ద ధ్వంసం చేసిన శిలాఫలకం

గాండ్లపెంట, జూన్14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరన్నగట్టుపల్లి గ్రామం వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని కొందరు గుర్తు తెలియని దుండగులు శుక్రవారం రాత్రి ధ్వంసం చేశారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా గొడ్డివెలగల పంచాయతీలో వీరన్నగట్టుపల్లి నుంచి నీరుకుంట్లపల్లి వరకు రూ.50 లక్షల ఉపాధి నిధులతో కల్వర్టు మట్టిరోడ్లు వేశారు. పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఈనెల 11న కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆవిష్కరించారు. దీన్ని చూసి ఓర్వలేక శిలాఫలాకాన్ని ధ్వంసం చేశారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

సౌందర్యాత్మక విమర్శకుడు రాజారామ్

పుస్తకావిష్కరణ సభలో డాక్టర్ శాంతినారాయణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

అనంతపురం కల్చరల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): సౌందర్యాత్మక విమర్శకుడు రాజారామ్ అని సాహితీవేత్త డాక్టర్ శాంతినారాయణ అన్నారు. కవి తూముచర్ల రాజారామ్ రచించిన 'తేనె పూల మీద తుమ్మెద' వ్యాస సంపుటిని శనివారం స్థానిక ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల ఆడిటోరియంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ శాంతినారాయణ మాట్లాడుతూ... నక్షత్ర మాలికలా 27 మంది కవుల కవిత్వాలను విశ్లేషించిన రాజారామ్ గ్రంథం కవిత్వాన్ని అనుభవించే దిశగా దారిచూపే సైన్‌బోర్డులా విశిష్టంగా ఉందన్నారు. సాహితీలోకానికి అంతగా పరిచయం లేని కవుల కవిత్వాలను చదివి, అనుభవించి వాటి సారాన్ని 'తేనె పూల మీద తుమ్మెద'లా అనంత సాహితీలోకానికి పరిచయం చేసిన రాజారామ్ కృషి అభినందనీయమన్నారు. స్పందన అనంత కవుల వేదిక ప్రధాన కార్యదర్శి చంద్రశేఖరశాస్త్రి మాట్లాడుతూ.. విమర్శకు ఒక శిల్పం ఉందనీ, దానిని పట్టుకోవడంలో రాజారామ్ విజయం సాధించారని అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాధా స్కూల్ ఆఫ్ లర్నింగ్ కరస్పాండెంట్ వేలూరి జయచంద్ర, సాహితీవేత్తలు అంకె శ్రీనివాస్, వ్యక్తిత్వ వికాస నిపుణుడు జీఎల్ఎన్ ప్రసాద్, డాక్టర్ రాధేయ, ఉప్పరపాటి వెంకటేశులు, తరిమెల అమరనాథరెడ్డి, జయరామప్ప, జిరసం అధ్యక్షుడు కొత్తపల్లి సురేష్, కథకుడు రాయుడు, గంగిరెడ్డి అశ్వత్థరెడ్డి, ప్రజ్ఞా సురేష్, జూటూరు షరీఫ్, టీవీ రెడ్డి, కంబన్న, వన్నప్ప పాల్గొన్నారు.

ఒకటే జాయినింగ్ తేదీ ఇవ్వాలి..

2012 డీఎస్సీ టీచర్లకు న్యాయం చేయాలి

యూటీఎఫ్ నాయకుల డిమాండ్


డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అనంతపురం విద్య, జూన్ 14(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2012 ద్వారా ఎంపికైన మున్సిపల్ టీచర్లందరికీ ఒకటే జాయింగ్ తేదీ ఇవ్వాలని యూటీఎఫ్ నాయకులు.. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల విద్యా శాఖాధికారులు ప్రసాద్ బాబు, కిష్టప్పను కోరారు. బాధిత టీచర్లతో కలిసి నాయకులు శనివారం ఆర్డీటీ ఆడిటోరియం వద్ద డీఈఓలను కలిశారు. వారు మాట్లాడుతూ... 2012 డీఎస్సీ ద్వారా 250 మంది ఎస్‌జీటీలు ఎంపికై జిల్లాలోని వివిధ మున్సిపల్ యాజమాన్య స్కూళ్లలో చేరారన్నారు. ఒక్కో మున్సిపాలిటీలో ఒక్కో తేదీన వీరు జాయిన్ అయ్యారన్నారు. వారి సీనియారిటీ మారిపోవడంతో బదిలీ పాయింట్లలో తీవ్ర వ్యత్యాసం వస్తోందన్నారు. దీంతో 1, 2 ర్యాంకులో ఉన్న వారు సైతం 60వ ర్యాంకు తర్వాత ఉంటున్నారన్నారు. ఇలా కొందరికి తీవ్ర నష్టం వాటిల్లుతోందన్నారు. దీనిపై పలుమార్లు అర్జీ ఇచ్చినా.. పరిష్కారం కావడం లేదన్నారు. టీచర్ల సమస్యలు దృష్టిలో ఉంచుకుని, 2012 డీఎస్సీ ఎస్‌జీటీలకు 31-12-2012 తేదీని పరిగణించి, బదిలీల పాయింట్లలో ఏర్పడిన అసంబద్ధతను తొలగించాలన్నారు. తర్వాత ఫైనల్ సీనియారిటీ లిస్టు సిద్ధం చేసి, మున్సిపల్ టీచర్లు, మైనర్ మీడియం టీచర్లకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరారు. ఆ మేరకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి జయచంద్రారెడ్డి, ఆడిట్ కమిటీ సభ్యుడు రమణయ్య, సీనియర్ నాయకులు కోటేశ్వరప్ప, నాగేంద్ర, ధర్మవరం రామాంజనేయులు, సాయి గణేష్, టీచర్లు పాల్గొన్నారు.

అనంత, నెల్లూరు జట్ల విజయ పరంపర

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సౌత్ జోన్ క్రికెట్ టోర్నీలో అనంతపురం, నెల్లూరు జట్లు వరుస విజయాలు సాధించాయి. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి సౌత్‌జోన్ సీనియర్ వన్డే క్రికెట్ టోర్నమెంట్ నాలుగో రోజు శనివారం స్థానిక అనంతపురం క్రికెట్ స్టేడియం(ఆర్డీటీ)లో కొనసాగింది. అనంతపురం, కర్నూలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన అనంతపురం జట్టు 47.3 ఓవర్లలో 263 పరుగులకు ఆలౌట్ అయ్యింది. బ్యాటర్లు ఎంకె దత్తారెడ్డి 69, అర్జున్ టెండూల్కర్ 61, రాజుకుళ్ళాయప్ప 50 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన కర్నూలు జట్టు 44.3ఓవర్లలో 201పరుగులకే కుప్పకూలింది. అనంత బౌలర్లు సంతోష్‌కుమార్ 3, ప్రదీప్‌రెడ్డి 3వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. మరో మ్యాచ్‌లో నెల్లూరు, చిత్తూరు జట్లు తలపడగా మొదట బ్యాటింగ్ చేసిన నెల్లూరు నిర్ణీత 50ఓవర్లలో 8వికెట్లు కోల్పోయి 334 పరుగులు చేసింది. బ్యాటర్లు సుబ్రహ్మణ్యం 114పరుగులు, ఫర్హాద్‌ఖాద్రి 57, రోషన్‌కుమార్ 53 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన చిత్తూరు 45.3ఓవర్లలో 283పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఇందులో బ్యాటర్ దినేష్‌వర్మ 133పరుగులు చేశారు. దీంతో నెల్లూరు 51పరుగుల తేడాతో విజయం సాధించింది. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీసత్యసాయి ప్రైమరీ స్కూల్‌లో ప్రవేశాలకు నేడు లాటరీ

పుట్టపర్తిరూరల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తిలోని శ్రీసత్యసాయి ప్రైమరీ స్కూల్‌లో ఒకటో తరగతి ప్రవేశానికి ఈనెల 20న లాటరీ పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు ప్రిన్సిపాల్ శివరామకృష్ణయ్య శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి స్థానిక ఇండోర్ స్టేడియంలో ఈనెల 20న ఉదయం 10 గంటలకు లాటరీ నిర్వహిస్తామన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల తల్లితండ్రులు గమనించాలని కోరారు.

హెచ్చెల్సీ లోకలైజేషన్ ఈఈగా పార్థసారథి

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): హెచ్చెల్సీ లోకలైజేషన్ ఈఈగా పార్థసారథి నియమితుడయ్యారు. మైనర్ ఇరిగేషన్ అనంతపురం డిప్యూటీ ఎస్ఈగా ఉన్న పార్థసారథిని హెచ్చెల్సీ లోకలైజేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా నియమిస్తూ రాష్ట్ర జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ధవళేశ్వరం ప్రాజెక్టు ఈఈగా ఉన్న సుధాకర్‌ను మైనర్ ఇరిగేషన్ అనంతపురం డిప్యూటీ ఎస్ఈగా బదిలీ చేశారు. ఇదివరకు లోకలైజేషన్ ఈఈగా పనిచేస్తున్న వెంకటరమణారెడ్డి గతనెల ఉద్యోగ విరమణ పొందారు.

వారికీ తల్లికి వందనం వర్తింపజేయాలి

ఏపీ స్టేట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్‌భాస్కర్

అనంతపురం విద్య, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు తల్లికి వందనం పథకం వర్తింపజేయాలని ఏపీ స్టేట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్‌భాస్కర్ శనివారం ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికల సమయంలో నెలకు రూ.25వేల కంటే తక్కువ జీతం తీసుకునే ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలు అమలు చేస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారన్నారు. దానిని అమలు చేయాలని ఆయన కోరారు.

చీనీ టన్ను రూ.34వేలు

అనంతపురంరూరల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.34,100 ధర పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.3వేలు, సరాసరి రూ.18వేలతో అమ్ముడుపోయినట్లు చెప్పారు. మార్కెట్‌కు మొత్తంగా 816టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.


రామగిరి మండలం సుద్దకుంటపల్లిలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు


కనగానపల్లి మండలం ముక్తాపురంలో టీడీపీ శ్రేణుల సంబరాలు


అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లిలో చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న డ్వాక్రా మహిళలు


కందుకూరులో కేక్ కట్ చేస్తున్న లబ్ధిదారులు, టీడీపీ నాయకులు

తల్లికి వందనం.. పేదల ఇంట ఆనందం

- పథకం అమలుపై గ్రామాల్లో సంబరాలు
- సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం

రామగిరి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకం అమలు కావడంతో పేదల ఇళ్లల్లో ఆనందం వెల్లివిరిసింది. గ్రామాల్లో అయితే పథకం లబ్ధిదారులు టీడీపీ నాయకులతో కలిసి సంబరాలు చేశారు. మండలంలోని సుద్దకుంటపల్లి, పేరూరు తదితర గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ శ్రేణులు, లబ్ధిదారులు శనివారం సంబరాలు చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యేపరిటాల సునీత చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఇంట్లో చదువుకునే పిల్లలు ఎంత మంది ఉంటే అంతమందికీ ప్రభుత్వం తల్లికివందనం పథకాన్ని వర్తింపజేయడం అభినందనీయమన్నారు. ఇచ్చిన ప్రతి హామీని సీఎం చంద్రబాబు నెరవేస్తున్నారన్నారు. బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు రంగయ్య, నాయకులు మారుతీప్రసాద్, మల్లెల ఆంజనేయులు, కిష్టప్ప, కుమార్‌నాయక్, రఘురాములు, ఆనంద్, పేరూరు లక్ష్మీనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

●అనంతపురంరూరల్: మండలంలోని ఆకుతోటపల్లి గ్రామ పంచాయతీలో యానిమేటర్లు జయలక్ష్మి, మహాలక్ష్మి డ్వాక్రా సంఘాల మహిళలు సంబరాలు చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్యే పరిటాల సునీత చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం అమలు చేసినందుకు ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్‌బాబు, క్లస్టర్ ఇన్‌చార్జ్ రాగేమురళి, తెలుగుయువత మండల అధ్యక్షుడు అనిల్ చౌదరి, డీలర్ చంద్రశేఖర్, గ్రామ కమిటీ అధ్యక్షుడు నారాయణస్వామి, నాయకులు డ్వాక్రామహిళలు పాల్గొన్నారు. అలాగే కందుకూరు గ్రామంలో టీడీపీ నాయకులు కేక్‌కట్ చేశారు. అనంతరం తల్లికి వందనం లబ్ధిదారులతో కలిసి ఎన్టీఆర్, చంద్రబాబు, పరిటాల రవీంద్ర చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. మండల కన్వీనర్ జింకాసూర్యనారాయణ , గ్రామ కమిటీ అధ్యక్షుడు పెద్దన్న, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● కనగానపల్లి: మండలంలోని ముక్తాపురంలో టీడీపీ నాయకులు తల్లికి వందనం లబ్ధిదారులతో కలిసి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి అందరికీ పంచారు. టీడీపీ కన్వీనర్ యాతం పోతలయ్య, నాయకులు శివయ్య, ప్రసాద్, దాసరి మల్లి, నారాయణస్వామి, క్రిష్టయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సంకష్ట చతుర్థి పూజలు

అనంతపురం కల్చరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): సంకష్ట చతుర్థిని పురస్కరించుకుని శనివారం సాయంత్రం నగరంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేశ్వరరోడ్డులోని లక్ష్మీగణపతి మందిరం, రామచంద్రనగర్‌లోని షిర్డిసాయి బాబా ఆలయం, తిలక్‌రోడ్డులోని రామాలయంతో పాటు తదితర ఆలయాల్లో అర్చకులు ఉదయమే గణనాథుని మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం గరిక, కుడుముల మాలలు, వివిధ రకాల పుష్పాలతో అలంకరించి పూజలు జరిపారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి దర్శించుకున్నారు.


మల్లేశ్వరరోడ్డులో పూజలందుకుంటున్న లక్ష్మీగణపతి

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా..?

- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తికి సవాల్

రామగిరి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రాప్తాడు నియోజకవర్గంలో గత వైసీపీ హయాంలో జరిగిన అభివృద్ధిపై, 2019కి ముందు, ఇప్పుడు ఎమ్మెల్యే పరిటాల సునీత చేసిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ దళిత సైన్యం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏపీ ముత్యాలు శనివారం ఒక ప్రకటనలో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి సవాల్ విసిరారు. పరిటాల కుటుంబం 1963 నుంచి ఇప్పటి వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తోందన్నారు. అలాంటి కుటుంబంపై ప్రకాష్‌రెడ్డి లేని పోని ఆరోపణలు చేస్తూ వచ్చే ఎన్నికల్లో సీటు కోసం పాట్లు పడుతున్నారన్నారు. గత ఐదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న ఆయన నియోజవర్గంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. పైగా అధికారాన్ని అడ్డం పెట్టుకుని వందల కోట్లు సంపాదించారని ఆరోపించారు. అలాగే వందలాది మంది ఎస్సీ, ఎస్టీ, బీసీలను పలు కేసుల్లో ఇరికించి నరకం చూపించారని మండిపడ్డారు. ఆత్మకూరు మండలం బీ.యాలేరులో పరిటాల సునీత ఎస్సీలకు ఇప్పించిన 157 ఇళ్ల పట్టాలను ఆయన ఎమ్మెల్యే అవగానే ఓసీ, బీసీలకు ఇప్పించారని, అప్పుడు ఎస్సీ, ఎస్టీలు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు.

అంబేడ్కర్ మిషన్ రాష్ట్ర, జిల్లా కమిటీల ఎన్నిక

అనంతపురం కల్చరల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): భారతీయ అంబేడ్కర్ మిషన్ రాష్ట్ర, జిల్లా నూతన కమిటీలు ఎన్నికయ్యాయి. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం రాష్ట్రంతోపాటు ఉమ్మడి అనంతపురం జిల్లా కమిటీలకు సంబంధించి పలు కేడర్లకు రాష్ట్ర అధ్యక్షుడు అరుణ్‌కుమార్, జాతీయ కార్యదర్శి గోపాల్ సమక్షంలో ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా భారతీయ అంబేడ్కర్ మిషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా తోట మకరన్న, ప్రధాన కార్యదర్శిగా బడిగి రాజేష్, సలహాదారుడుగా జూటూరు రమేష్, కార్యదర్శిగా రేగటి చిన్నప్ప, కర్నూలు జిల్లా అధ్యక్షుడిగా ఉమాపతి, అనంతపురం జిల్లా అధ్యక్షుడిగా అక్కులప్ప, సత్యసాయి జిల్లా అధ్యక్షుడిగా రాజన్న, రాప్తాడు నియోజకవర్గ అద్యక్షుడిగా రామకృష్ణ, కార్యవర్గ సభ్యులుగా పోతులూరి సురేష్, బ్రహ్మయ్యను ఎన్నుకున్నారు.

ఇసుకను తరలిస్తే ఒప్పుకోం..

- సీఐతో నిదనవాడ గ్రామస్థులు

శింగనమల జూన్14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిదనవాడ సమీపంలోని పెన్నానదిని సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ విజయ్‌కుమార్ శనివారం పరిశీలించారు. ఇక్కడ ఇసుక తరలింపును అడ్డుకోవడంపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఇందుకు వారు మాట్లాడుతూ.. తమ గ్రామంలోని అన్ని కుటుంబాల వారు వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారన్నారు. చాలామంది పంట్లతోటల పెంపకం చేపట్టారన్నారు. ఈ పెన్నానది వల్లే వ్యవసాయ బోర్లలో భూగర్భజలాలు పుష్కలంగా ఉంటాయన్నారు. అయితే పదేళ్లుగా ఈ ప్రాంతం నుంచి ఇసుకను అనేకమంది తరలించేందుకు ప్రయత్నిస్తున్నారని, దాన్ని గ్రామస్థులందరం కలిసి అడ్డుకుంటున్నామని తెలిపారు. ఇక్కడ ఇసుక తరలిస్తే భూగర్భ జలాలు అడుగంటి మా పంటలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. కనుక ఎట్టి పరిస్థితిల్లోనూ ఇక్కడి నుంచి ఇసుకను తరలిస్తే ఒప్పుకోమని వారు స్పష్టం చేశారు. ఇందుకు సీఐ మాట్లాడుతూ.. ఈవిషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లాతానని పేర్కొన్నారు.

రక్తదాన శిబిరాల నిర్వహణలో జిల్లా రెడ్‌క్రాస్‌కు తృతీయ స్థానం


రక్తదాతను సన్మానిస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రక్తదాన శిబిరాల నిర్వహణ, రక్తసేకరణ, రక్తం అందించడంలో జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి తృతీయ స్థానం దక్కినట్లు ఆ సొసైటీ జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతి పేర్కొన్నారు. స్థానిక ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలో శనివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని నిర్వహించారు. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో ఏర్పాటు చేసిన ప్లేట్‌లెట్ ఆజిటేటర్, ఇంక్యుబేటర్లు, మోబిస్ ఇండియా అందించిన వివిధ పరికరాలను ప్రారంభించారు. జిల్లాలో కళ్యాణదుర్గం ఎమ్మెల్యే 3వేల యూనిట్ల రక్తదానం, సీజీఎస్‌టీ 350యూనిట్లు, ఎస్ఆర్ఐటీ, ప్రభుత్వ కళాశాల, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ విష్ణుప్రియ, ఆలంబన జనార్దన్‌లతో పాటు పలువురు రక్తదాతలు, స్వచ్ఛంద రక్తదాన సంస్థలు ఈ ఏడాదిలో 81రక్తదాన శిబిరాలు నిర్వహించి జిల్లాను తృతీయ స్థానంలో నిలిపారని కాపు భారతి తెలిపారు. అనంతరం పలువురు రక్తదాతలను సన్మానిం చారు. కార్యక్రమంలో ఆర్డీఓ కేశవనాయుడు, అసిస్టెంట్ కమిషనర్ సుందరరాజు, రెడ్‌క్రాస్ వైస్‌చైర్మన్ లక్ష్మణప్రసాద్, రక్తదాతలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీకారులు

అనంతపురం కల్చరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పద్యకవి పూజారి వెంకటేశ్వర ప్రసాద్ రచించిన 'స్మృతి విపంచి' పుస్తకాన్ని స్థానిక ఆర్ట్స్ కళాశాల ఆవరణలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు సాహితీకారులు డాక్టర్ అంజనీకుమార్, జూటూరు పద్మ ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. 'స్మృతి విపంచి' పుస్తక రచనలో వెంకటేశ్వర ప్రసాద్ రచనాశైలి ఎంతో అందంగా ఉందంటూ కొనియాడారు. అనంతరం జగర్లపూడి శ్యామసుందరశాస్త్రి పద్యగానంతో అలరించారు. తర్వాత పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాణ్యం వసుంధర, వెంకటరమణమూర్తి, ఏలూరు యంగన్న, నరసింహులు, స్వరూపరాణి, మాదవ్, సాహితీప్రియ, పృథ్విరాజ్, శేషాచార్యులు పాల్గొన్నారు.

ఘనంగా అంజనాదేవి ఆరాధన మహోత్సవం

చెన్నేకొత్తపల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రం సమీపంలో ఉన్న కోనకన్యాశ్రమంలో మాతృశ్రీ అంజనాదేవి 48వ ఆరాధాన మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమం అధ్యక్షుడు దత్తానందగిరిస్వామి ఆధ్వర్యంలో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకులు భగవద్గీత పారాయణం, లలితా సహస్ర నామపారాయణం చేపట్టారు. మాతృశ్రీ సమాధిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పలువురు ఆశ్రమాధిపతులచేత ఆధ్యాత్మిక ప్రవచనాలు చేపట్టారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారి సమాధిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.


ప్రత్యేకాలంకరణలో అంజనాదేవి సమాధి

చంద్రబాబుతోనే పేదల అభ్యున్నతి

- మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



అనంతపురం అర్బన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సంక్షేమం సీఎం చంద్రబాబు తోనే సాధ్యమని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు పేర్కొన్నారు. నగరంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. భారత దేశంలోనే పెద్ద స్థాయిలో నగదు బదిలీ జరిగిన పథకం తల్లికి వందనం అని అన్నారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన మాట మేరకు ఇంట్లో ఎంత మంది చదువుకునే పిల్లలుంటే అంత మందికి తల్లికి వందనం పథకాన్ని అమలు చేశారన్నారు. దీనివల్ల రాష్ట్రంలోని తల్లులందరూ ఆనందం వ్యక్తం చేస్తున్నారని, విద్యార్థులు సంతోషంగా ఉన్నారని అన్నారు. గత వైసీపీ పాలనలో అమ్మఒడి ద్వారా రూ.5వేల కోట్లు జమ చేస్తే.. ఇప్పుడు సీఎం చంద్రబాబు తల్లికి వందనం ద్వారా రూ.10వేల కోట్లు జమ చేశారని తెలిపారు. త్వరలోనే అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సదుపాయం అమలవుతాయన్నారు. ఆర్థిక లోటుపాట్లు ఉన్నప్పటికీ ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు నెరవేస్తున్నారని, సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

చంద్రబాబుతోనే ప్రజాసంక్షేమం

- టీడీపీ క్రిష్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్

అనంతపురం అర్బన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు తోనే ప్రజా సంక్షేమం సాధ్యమని టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్టీఆర్ అప్పట్లో పేదలకు కిలో బియ్యం రూ.2లకు అందించి చరిత్ర సృష్టిస్తే.. ఇప్పుడు తల్లికి వందనం పథకాన్ని ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలుంటే అంత మందికి వర్తింపజేసి సీఎం చంద్రబాబు చరిత్ర సృష్టించారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కుటుంబంలో ఒక విద్యార్థికి మాత్రమే అమ్మఒడిని వర్తింపజేశారన్నారు. సీఎం చంద్రబాబు ఒక్కొక్కటిగా ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

తల్లికి వందనం పేదలకు వరం

- టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పరశురాం

అనంతపురం విద్య, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన తల్లికి వందనం పేదలకు వరంగా మారిందని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పరశురాం శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాటను నిజం చేస్తూ.. సీఎం చంద్రబాబు ఒక్కో విద్యార్థికి రూ.13 వేలు చొప్పున వారి తల్లుల ఖాతాల్లో జమ చేశారన్నారు. దీంతో ఆయనతో పాటు మంత్రి లోకేష్ చిత్రపటాలకు ప్రజలు పాలాభిషేకం చేస్తూ... ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి నివాళి


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

శింగనమల, జూన్14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సలకంచెరువు లో టీడీపీ నాయకుడు ఈడిగ శ్రీనివాసులు అనారోగ్యంతో గత శుక్రవారం మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్, ఏడీసీసీ బ్యాంకు చెర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలంనరసానాయుడు, రాష్ట్ర కార్యానిర్వాహక కా ర్యదర్శి కే. రామలింగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే యామినీబాల, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు, రాష్ట్ర నాయీబ్రాహ్మణ సంక్షేమ డైరెక్టర్ ఎం.ఆదినారాయణ తదితరులు శనివారం ఆ గ్రామానికి వెళ్లి అతడి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

వ్యక్తిపై కత్తులతో దాడి

అనంతపురం క్రైం, జూన్14(ఆంధ్రజ్యోతి): కుటుంబసభ్యులను దూషించాడని ఇద్దరు వ్యక్తులు ఓ వ్యక్తిపై కత్తులతో దాడి చేశారు. ఈ క్రమంలో అడ్డుకున్న భార్యకు గాయాలయ్యాయి. నగర శివారులోని ఎన్టీఆర్‌కాలనీలో దూదేకుల సిద్ధయ్య, రసూల్, క్రాంతికుమార్‌లు నివాసముంటున్నారు. రెండు రోజుల క్రితం సిద్ధయ్య క్రాంతికుమార్ కుటుంబసభ్యులను దూషించాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి 11గంటల సమయంలో క్రాంతికుమార్, రసూల్‌లు సిద్ధయ్యపై కత్తితో దాడి చేసి గాయపరిచారు. అడ్డుకున్న భార్య షహీరాభానుకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఘటనపై వన్‌టౌన్ పోలీసులు శనివారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పరిటాల సునీతను కలిసిన తెలంగాణ మంత్రి సీతక్క

అనంతపురం అర్బన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతను తెలంగాణ మంత్రి సీతక్కను కలిశారు. హైదరాబాద్‌లోని పరిటాల సునీత నివాసానికి శనివారం మంత్రి సీతక్క వెళ్లారు. ఈ సందర్భంగా ఆమెకు పరిటాల సునీతతో పాటు కుటుంబ సభ్యులు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం మంత్రి సీతక్క ఎమ్మెల్యే పరిటాల సునీతతో ఆప్యాయంగా మాట్లాడారు. పలు అంశాలపై చర్చించుకున్నారు. గతంలో టీడీపీలో ఉన్న సమయంలో జరిగిన పలు అంశాలను నెమరువేసుకున్నారు. ప్రస్తుతం తెలంగాణ, ఏపీలో రాజకీయాలపై చర్చించారు.


మంత్రి సీతక్కకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, కుటుంబసభ్యులు

నీట్‌లో గ్లోబల్ విద్యార్థినుల ప్రతిభ

అనంతపురం విద్య, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నీట్‌లో గ్లోబల్ విద్యాసంస్థల విద్యార్థినులు ప్రతిభ చూపి ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు ఆ సంస్థ యాజమాన్యం అకడమిక్ డీన్ ఆంజనేయులు, ప్రిన్సిపాల్ నిర్మల తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థినులను శనివారం వారు అభినందించారు. తర్వాత మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు నీట్‌లో అసాధారణ ఫలితాలు సాధించారన్నారు. విద్యార్థులు లిఖిత 4596 వ ర్యాంకు, ముస్కన్ 15,023వ ర్యాంకు, కీర్తన 25,842 వర్యాంకు, టీఎం మహమ్మద్ 51,790వ ర్యాంకు, క్షమిత 94,613వ ర్యాంకు సాధించారన్నారు. కళాశాల ప్రారంభించిన రెండేళ్లలోనే మంచి విజయాలు సాధించినందుకు ఆనందంగా ఉందన్నారు. బ్రాండెడ్ ఫ్యాకల్టీ అందించిన బోధనా నైపుణ్యాల విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడ్డాయని పేర్కొన్నారు.


ప్రతిభ చూపిన లిఖిత, ముస్కన్, కీర్తన, టీఎం మహమ్మద్

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏను రెన్యువల్ చేయాలి: ఎమ్మార్పీఎస్

అనంతపురం సెంట్రల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పేదకు అనేక సేవలందిస్తున్న ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏను రెన్యువల్ చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం, మైనార్టీలతో కలిసి నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. క్లాక్‌టవర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ అంబేడ్కర్ విగ్రహం వద్ద వరకు కొనసాగింది. అక్కడ అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. తర్వాత కలెక్టరేట్‌కు చేరుకుని ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహం వద్ద కొద్దిసేపు నిరసన తెలిపి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధికార ప్రతినిధి అక్కులప్ప మాట్లాడుతూ జిల్లాలో ప్రతి గ్రామంలోనూ పేదల జీవితాల్లో ఆర్డీటీ వెలుగులు నింపిందన్నారు. అలాంటి సంస్థకు నేడు ఎఫ్‌సీఆర్ఏను నిలిపివేయడం తగదన్నారు. ఇప్పటికైనా కేంద్ర స్పందించి రెన్యువల్ చేయాలని డిమాండ్‌చేశారు. మాజీ జడ్పీటీసీ కొల్లాపురప్ప, నాయకులు గోవిందు, తిప్పేస్వామి, విరుపాక్షి, గరక్‌బాషా, రామాంజనేయులు, వెంకటేశులు, లాల్‌సింగప్ప, శీనా తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు

అపూర్వ సమ్మేళనం

- 46ఏళ్ల తరువాత మళ్లీ బడికి..

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): వారంతా నాలుగున్నర దశాబ్దాల తర్వాత కలిశారు. ఆత్మీయంగా పలకరించుకుంటూ రోజంతా ఆనందంగా గడిపారు. నగరంలోని నగరపాలకోన్నత పాఠశాలలో 1979లో పదో తరగతి చదివిన విద్యార్థుల అపూర్వ సమ్మేళనం శనివారం అదే పాఠశాలలో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాటి విద్యార్థులు తమ చిన్న నాటి సంగతులు గుర్తు చేసుకుని మురిసిపోయారు. అక్షర భిక్ష పెట్టిన అప్పటి గురువులు గంగాచారి, రంగప్ప, సూర్యప్రకాష్‌రావు, కృష్ణమూర్తిలను ఘనంగా సన్మానించారు. పాదాభివందనం చేసి, దీవెనలు పొందారు. అనంతరం దివంగతులైన అప్పటి ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులకు సంతాపం తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మున్సిపల్ కృష్ణమూర్తి, ఇంజనీరు సుధాకర్‌బాబు, ఎస్‌కేయూ సత్యనారాయణ, సుదర్శన్‌రెడ్డి, జహీర్, సంధాని, రాజశేఖర్, శీనా, మురళి, కృష్ణ, శ్రీనివాసరెడ్డి, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.


గురువులతో పూర్వ విద్యార్థులు

వ్యక్తి ఆత్మహత్య

కనగానపల్లి, జూన్14(ఆంధ్రజ్యోతి): రాప్తాడు మండలం బండమీదపల్లి గ్రామానికి చెందిన బోయ వెంకటేష్(46) కనగానపల్లి మండలకేంద్రం శివారులో ఉన్న తన పొలంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. బోయ వెంకటేష్ వ్యవసాయ కూలీగా జీవనం సాగించేవాడు. కాగా శనివారం ఉదయం ఇంటి నుంచి బయటికి వచ్చిన అతను కనగానపల్లి వద్ద గల తన పొలానికి వెళ్లి ఉరి వేసుకున్నాడు. స్థానికులు గమనించి కనగానపల్లి పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు వచ్చి మృతుడు బోయ వెంకటేష్‌గా గుర్తించి కుటుంబసభ్యులకు తెలిపారు. అనంతరం మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బోయ వెంకటేష్ అనారోగ్యం కారణంగా ఆత్మహత్య చేసుకున్నాడా లేక ఇతర కారణాలు ఉన్నాయా అనేది పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.అతడికి భార్య ఈశ్వరమ్మ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

ఆ 2 వేలు ఎవరి ఖాతాలోకి వెళ్లాయి?

- విలేకరుల సమావేశంలో మేయర్ వసీం

అనంతపురం క్రైం, జూన్14(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం అమలు చేసిన తల్లికి వందనంలో తగ్గించిన రూ.2వేలు ఎవరి ఖాతాలోకి వెళ్లాయని నగర మేయర్ మహ్మద్ వసీం ప్రశ్నించారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ పాలనలో అమ్మఒడిలో రూ.2వేలు తగ్గిస్తే ఎవరి ఖాతాలోకి వెళాయని అప్పట్లో లోకేష్ విమర్శించారని, మరి ఇప్పుడు తల్లికి వందనంలో తగ్గించిన రూ.2వేలు ఎవరి ఖాతాలోకి వెళ్లాయో చెప్పాలని ప్రశ్నించారు. ఎమ్మెల్యే దగ్గబాటి ప్రసాద్ తరచూ అబద్దాలు చెబుతూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన 143 హామీలలో ఎన్ని అమలు చేశారని ప్రశ్నించారు. కార్యక్రమంలో మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లా బేగ్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

కనగానపల్లి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని దాదులూరు వద్ద గల 44వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. రామగిరి మండలం కలికివాండ్ల పల్లి గ్రామానికి చెందిన వడ్డే మునలన్న, ముత్యాలమ్మ దంపతులు గృహ నిర్మాణ కార్మికులుగా పని చేశారు. ఈ క్రమలో పని నిమిత్తం బైక్‌లో ధర్మవరం బయలు దేరారు. కాగా మార్గ మధ్యంలోని దాదులూరు వద్ద బెంగళూరు నుంచి అనంతపురం వెలుతున్న కారు వెనుక నుంచి వేగంగా ఢీకొంది. ప్రమాదంలో దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే వారిని హైవే అంబులెన్స్‌లో అనంతపురంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మునలన్న పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. కనగానపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఆలయ నిర్మాణ పనుల పరిశీలన

రాప్తాడు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలో టీటీడీ ఆధ్వర్యంలో జరుగుతున్న పండమేటి వెంకటరమణస్వామి ఆలయ నిర్మాణ పనులను అధికారులు శనివారం పరిశీలించారు. ఆలయ నిర్మాణ పనులను, కోనేటిని పరిశీలించారు. నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో టీటీడీ సూపరిండెంట్ ఇంజనీర్ మనోహర, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మనోహర్‌బాబు, అసిస్టెంట్ ఇంజనీర్లు దివాకర్, తిరుమలరావు, మోహనయ్య, ఆలయ కమిటీ అధ్యక్షుడు గంజి రాముడు, ఫీల్డ్ అసిస్టెంట్ శివ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల సభ్యులకు ఈ బైక్‌ల పంపిణీ

- పంపిణీ చేసిన ఎమ్మెల్యే, కలెక్టర్

అనంతపురం అర్బన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): దేశంలోనే తొలి సారిగా మహిళా సంఘాల సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం ర్యాపిడో ఈ బైక్‌లు అందజేస్తోందని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక పోలీసు పరేడ్ మైదానంలో జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ తో కలిసి ఆయన రాపిడో ఈ బైక్‌ల పంపిణీని శనివారం ప్రారంభించారు. అనంత రం 20మంది సంఘం సభ్యులకు ర్యాపిడో ఈ బైక్‌లను అందజేశారు. ఎమ్మెల్యే దగ్గుపా టి మాట్లాడుతూ అనంతపురం అర్బన్ నియోజకవర్గానికి 250 ఈ బైక్‌లు మంజూరు కాగా.. తొలి విడతలో 20 పంపిణీ చేసినట్లు తెలిపారు. ఒక్కో బైక్ విలువ రూ.1.23 లక్షలు కాగా.. డౌన్ పేమెంట్ కింద రూ.18వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. నెలకు 15వేల నుంచి రూ.18వేల దాకా ఉపాధి పొందే విధంగా ప్రణాళికలు రూపొందించారన్నారు. జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ నగరాల్లో మహిళా రైడర్ల సేవలను ప్రారంభించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం మహిళా సంఘాల సభ్యులకు ర్యాపిడో ఈ బైక్‌లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ర్యాపిడో ఈ బైక్‌లను సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, మెప్మా పీడీ విశ్వజ్యోతి, డీఆర్‌డీఏ పీడీ శైలజ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


మహిళాసంఘం సభ్యురాలికి ఈ బైక్ తాళాలు అందజేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి, కలెక్టర్ వినోద్‌కుమార్

వెంకటేశ్వరుడి వైభవం

అనంతపురం కల్చరల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): స్థానిక హౌసింగ్‌బోర్డు భక్తాంజనేయస్వామి ఆలయంలో శ్రీవారి సేవలో ఒకరోజు పేరుతో శనివారం నిర్వహించిన వెంకటేశ్వర వైభవం కార్యక్రమం నయనానందకరంగా సాగింది. ఉదయం స్వామివారికి జేష్టాభిషేకం చేశారు. అనంతరం చినజీయర్ స్వామి శిష్యబృందం సమక్షంలో తిరుమంజనం, అష్టదళ పద్మార్చన, తోమాల సేవ, పుష్పయాగం, తిరుప్పాడ సేవ నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ శ్రీవారి తిరుకల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. శ్రీవారికి 108 రకాల హారతులు నివేదించారు. తదనంతరం శ్రీవారికి గరుడసేవ నిర్వహించి కార్యక్రమాన్ని ముగించారు. సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో చినజీయర్‌స్వామి శిష్యుడు మధుసూదనాచార్యులు, మణూరు నాగరాజరావు, పరుచూరు రమేష్, బాంబేడైయింగ్ నాగన్న, ఆళ్లగడ్డ రాము, సంధ్యామూర్తి, టీడీపీ నాయకుడు శ్రీనివాసచౌదరి, హోప్ ఫర్ స్పందన మాధవి, సాయి ట్రస్టు సభ్యులు రాఘవేంద్ర, విజయభాస్కర్, వెంకటశేషయ్య, రాము తదితరులు పాల్గొన్నారు.


కల్యాణోత్సవ ఘట్టం నిర్వహిస్తున్న వేదపండితులు


108 రకాల హారతులు నివేదిస్తున్న భక్తులు

న్యూస్ బాక్స్

దరఖాస్తు చేసుకోండి

పామిడి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎద్దులపల్లి రోడ్డులోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో విద్యార్థుల ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని హాస్టల్ వార్డెన్ ఆదినారాయణ పేర్కొన్నారు. 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఉన్న విద్యార్థులు అర్హులన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం, బెడ్‌షీట్, కార్పెట్, ప్లేటు, గ్లాసు, ట్రంకు పెట్టే, కాస్మొటిక్ చార్జీలు అందజేస్తామన్నారు. దరఖాస్తుతో పాటు విద్యార్థి, వారి తల్లిదండ్రుల ఆధార్, రేషన్‌కార్డు జిరాక్స్, విద్యార్థి టీసీ, మూడు ఫోటోలు అందజేయాలన్నారు.

నేడు కంటి వైద్యశిబిరం

పామిడి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక భావసార క్షత్రియ కల్యాణ మండపంలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బెంగుళూరు శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయూష్ సీనియర్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు, లయన్స్ క్లబ్ మండల అధ్యక్షుడు రఘువీర్ తెలిపారు. కంటి వైద్యశిబిరానికి హాజరయ్యే వారు ఆధార్ కార్డు రెండు జిరాక్స్, రెండు ఫోటోలు, మునుపటి హెల్త్ రికార్డులు తీసుకొని రావాలన్నారు. ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

వైద్యురాలికి మెమో

బొమ్మనహాళ్, జూన్14(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆసుపత్రి వైద్యురాలు శ్రీలక్ష్మికి డీడీఓ, డీ. హీరేహాళ్ వైద్యాధికారి శ్రావణ్‌కుమార్ శనివారం మెమో జారీ చేశారు. ఈ వైద్యురాలు విధులను నిర్లక్ష్యం చేస్తున్నారని, రోగులకు అందుబాటులో ఉండటం లేదని మార్కెట్ యార్డు మాజీ డైరక్టర్ కొత్తపల్లి మహేంద్ర శుక్రవారం ఆరోపించిన విషయం తెల్సిందే. దీంతో డీడీఓ శనివారం ఆ ఆస్పత్రిని తనిఖీ చేశారు. శనివారం కూడా ఆమె వేళకు ఆస్పత్రిలో లేకపోవడంతో.. జిల్లా వైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు వైద్యురాలు శ్రీలక్ష్మికి డీడీఓ మెమో జారీ చేశారు.

విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

గుంతకల్లుటౌన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలు విద్యాసంస్థలు విద్య పేరుతో దోపిడీ చేస్తున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పట్టణంలో వైఎస్ఆర్ఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ నాయకులు ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. అధిక ఫీజులు, యూనిఫాం, పుస్తకాల పేరుతో విద్యాసంస్థలు చేస్తున్న దోపిడీని అరికట్టేలా జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంశీయాదవ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకట్‌నాయక్, నాయకులు మణికంఠ, పవన్, లోకేష్, శ్యామ్‌సుందర్, అబ్దుల్, అశోక్ పాల్గొన్నారు.

ఘనంగా చేగువేరా జయంతి

గుంతకల్లుటౌన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హంపిరెడ్డి భవనంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో చేగువేరా జయంతిని శనివారం నిర్వహించారు. డీవైఎఫ్ఐ నాయకులు చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి సురేంద్రబాబు, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు రమేష్, వెంకి, శివరామ్, రాఖీ, సోహెల్, చందు, సుధీర్ పాల్గొన్నారు.

ఘనంగా రక్తదాతల దినోత్సవం

గుంతకల్లుటౌన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలోని బ్లడ్ బ్యాంక్‌లో రెడ్‌డ్రాప్ ఆర్గనైజేషన్, రక్తదాత సంస్థల ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని నిర్వహించారు. ఎక్కువ సార్లు రక్తదానం చేసిన రంజాన్, తిప్పన్న, గోపి, చంద్రశేఖర్‌ను సన్మానించారు. ఇందులో సంస్థ గౌరవ అధ్యక్షుడు ఇస్మాయిల్, రెడ్‌డ్రాప్ వ్యవస్థాపకుడు రెహమాన్, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

● ఉరవకొండ : పట్టణానికి చెందిన సెపక్‌తక్రా జిల్లా అధ్యక్షులు, సామాజిక కార్యకర్త సప్తగిరి మల్లికార్జున అనేక సార్లు రక్తదాన శిబిరాలతో పాటు రక్తదానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో ఆయన్ను ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి, ఐఆర్‌సీఎస్ సభ్యులు జనార్ధన్ అనంతపురంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం సన్మానించారు.

శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మించండి

కణేకల్లు, జూన్, 14(ఆంధ్రజ్యోతి): స్థానిక కబరస్తాన్ (శ్మశాన వాటిక)కు ప్రహరీ నిర్మించాలని కణేకల్లుకు చెందిన ముస్లిం కబరస్తాన్ అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులను కోరారు. ఈ మేరకు శనివారం వారు రాయదుర్గంలో ఆయనకు వినతి పత్రం అందజేసిన వారు మాట్లాడారు. కబరస్తాన్‌కు ప్రహరీ లేకపోవడంతో వివిధ జంతువులు వచ్చి.. అపవిత్రం చేస్తున్నాయని అన్నారు. విప్ మాట్లాడుతూ.. ప్రహరీ నిర్మాణానికి నిధులు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని వారికి హామి ఇచ్చారు. ఇందులో షేక్ గౌస్, బషీర్, మోబైల్ భాష, జావిద్, గౌస్‌పీరా, షాకీర్, షాహన్ వాజ్ పాల్గొన్నారు.

ఘనంగా వికసిత్ భారత్ సంకల్ప సభ

తాడిపత్రి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): పెద్దపప్పూరు మండలకేంద్రంలో శనివారం బీజేపీ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప సభ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ పీవీ ప్రతాప్‌రెడ్డి, నాయకులు నారాయణస్వామి, గంగాధర్, శింగరి లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

నీట్‌లో ప్రతిభ


హరిత

పామిడి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్టకిందపల్లి గ్రామానికి చెందిన రైతు పెరమసాని రామాంజనేయులు, రమాదేవి దంపతుల కుమార్తె పెరమసాని హరిత నీట్‌లో ప్రతిభ చాటింది. నీట్‌లో 547 మార్కులు సాధించి ఆల్ ఇండియాలో 13,567వ ర్యాంక్ సాధించింది.


వర్షిత్

● బెళుగుప్ప: మండలంలోని గంగవరం గ్రామానికి చెందిన వర్షిత్‌రెడ్డి నీట్‌లో 4,951వ ర్యాంక్ సాధించారు. ఆమె తండ్రి ట్రాన్స్ కో ఏఈ నారాయణస్వామి కరోనాతో మరణించారు. తల్లి కవిత అనంతపురం ట్రాన్స్‌కోలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు.


మోక్షిత్

అలాగే మండల కేంద్రానికి చెందిన ఏపీఎస్ ఆర్టీసీ కండెక్టర్ కేబీ శివప్రసాద్, శాంతిల పెద్ద కుమారుడు మోక్షిత్ సాయి నీట్‌లో ప్రతిభ చాటాడు. 448 మార్కులు సాధించి లక్షా 24 వేల ర్యాంక్ సాధించాడు.

పరిశుభ్రతపై అవగాహన

కూడేరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మండలం గొట్కూరు గ్రామంలోని లెప్రసీ కాలనీలో రోగులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. శనివారం టి బి ముక్తా భారత్ అదనపు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ అనుపమజేమ్స్ పర్యవేక్షణలో వైద్య సిబ్బంది రోగుల గాయాలను శుభ్రం చేసి మందుల అందజేశారు. కార్యక్రమంలో డీపీఎంఓ సత్యనారాయణ, ఫిజియో తెరపిస్ట్ రాముడు, తిప్పేస్వామి, సూపర్‌వైజర్ రవీంద్ర పాల్గొన్నారు.

విమాన ప్రమాద మృతులకు నివాళి

యాడికి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదంలో మరణించిన వారికి స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం నివాళులర్పించారు. వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. ఇందులో ఆర్యవైశ్యులు రవితేజ, చంద్రశేఖర్, పలువురు చిన్నారులు పాల్గొన్నారు.

సార్ లేక.. ఇక్కట్లు !

గ్రామ పంచాయతీ కార్యదర్శి పోస్ట్ ఖాళీ


యాడికి గ్రామ పంచాయతీ కార్యాలయం

యాడికి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా యాడికి గ్రామ పంచాయతీ కార్యదర్శి అశ్వర్థమనాయుడు పామిడికి బదిలీ అయ్యారు. పామిడిలో పంచాయతీ కార్యదర్శి గోపాల్ యాడికి బదిలీ అయ్యారు. యాడికి పంచాయతీ కార్యదర్శి అశ్వర్థమనాయుడు విధుల నుంచి రిలీవ్ అయి పామిడిలో బాధ్యతలు చేపట్టారు. అయితే పామిడి పంచాయతీ కార్యదర్శి గోపాల్ అక్కడ రిలీవ్ అయినా.. ఇక్కడ బాధ్యతలు చేపట్టలేదు. ఆయన ఇక్కడ బాధ్యతలు చేపట్టకుండా ప్రజా ప్రతినిధులు అడ్డుపడుతున్నట్లు సమాచారం. దీంతో ప్రస్తుతం యాడికి పంచాయతీ కార్యదర్శి ఎవరు అనేది ప్రశ్నార్థంగా మారింది. యాడికి గ్రామ పంచాయతీకి ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శి ఎవరూ లేకపోవడంతో వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే స్థానికులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. పారిశుధ్య కార్మికుల సిబ్బంది వేతనాల మంజూరు, వివిధ రకాల బిల్లుల చెల్లింపులు ఆగిపోయాయి. గ్రామపంచాయతీల్లో డ్రైనేజీ, వీధిలైట్ల నిర్వహణ భారంగా మారుతోంది. గ్రామ పంచాయతీ కార్యదర్శిగా కొత్త వ్యక్తి వచ్చేంతవరకైనా ఇన్‌చార్జి బాధ్యతలు ఎవరికైనా అప్పగిస్తే గ్రామపంచాయతీలో పాలన కుంటు పడదని స్థానికులు కోరుతున్నారు.

శేషతల్ప అలంకరణలో ఎర్రితాత



బెళుగుప్ప, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అవధూత ఎర్రితాత స్వామి ఆరాధనోత్సవాలు శనివారం ఘనం గా నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, బిల్వార్చన, పల్లకిసేవ నిర్వహించారు. సాయంత్రం శేషతల్ప అలంకారంలో స్వామి దర్శనమిచ్చారు. రాత్రి ఎర్రితాత ప్రభోత్సవం ఊరేగింపుతో రెండో ఉత్సవాలు ముగిశాయి. ఆదివారం ఉట్ల పరుష నిర్వహిస్తున్నట్లు సేవా సంఘం తెలిపింది.

పెన్నహోబిలంలో ప్రత్యేక పూజలు



ఉరవకొండ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. బ్రహ్మోత్సవాల అనంతరం ఆలయంలో నెలపూజ నిర్వహించడం ఆనవాయితీ. భక్తులు దాసంగాలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

● వైభవంగా ప్రాకారోత్సవం : పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం ప్రాకారోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించి, పల్లకిలో కొలువుదీర్చి.. మేళతాళాలతో ఆలయం చుట్టూ ఊరేగించారు.

నేమకల్లు అంజన్నకు విశేష పూజలు



బొమ్మనహాళ్, జూన్ 14(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నేమకల్లు ఆంజనేయస్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, పంచాంమృత అభిషేకం, నిర్మల్యవిసర్జన, అష్టోత్తర నిర్వహించారు. స్వామి వారి దర్శనానికి వందలాది మంది భక్తులు తరలివచ్చారు. భక్తులకు అన్న సంతర్పణం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో పూజలు




రాయదుర్గంరూరల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్రవన్నూరు గ్రామ సమీపంలో వెలిసిన అపులాపురం ఆంజనేయస్వామి దేవాలయంలో, మల్లాపురం గ్రామ సమీపంలో వెలిసిన విప్రమలై లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే దేవాలయాల్లో స్వామివారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చ న, వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ అనంతరం పూజలు నిర్వహించారు.

ట్రాన్స్‌కో ఏఈఈ సలీంపై బదిలీ వేటు

కళ్యాణదుర్గం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కళ్యాణదుర్గం ట్రాన్స్‌కో సబ్‌డివిజన్ డీఈఈ గురురాజు, కళ్యాణదుర్గం రూరల్ సెక్షన్ ఇన్‌చార్జి ఏఈఈ సలీం ఫోన్‌లో దుర్భాషలాడుకోవడాన్ని విద్యుత్తుశాఖ ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణించారు. ఏఈఈ ఇష్టానుసారంగా దూషించటంతో సదరు డీఈఈ సెలవు పెట్టి వెళ్లిపోయారు. ఈ క్రమంలో విచారణ చేపట్టిన అధికారులు డీఈఈని ఫోన్‌లో దుర్భాషలాడిన ఏఈఈ సలీంపై చర్యలకు ఉపక్రమించారు. అనంతపురం ప్రొటెక్షన్‌కు బదిలీ చేస్తూ ఎస్ఈ శేషాద్రిశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. శెట్టూరు సెక్షన్ ఏఈ సలీం కళ్యాణదుర్గం రూరల్ సెక్షన్ ఇన్‌చార్జిగా ఉన్నారు. ఈ రెండు సెక్షన్ల నుంచి ఆయనను తప్పించారు. శెట్టూరు సెక్షన్ పర్యవేక్షణ బాధ్యతలను బ్రహ్మసముద్రం ఏఈ భరత్‌కుమార్‌కు అప్పగించారు. ఉరవకొండ ఏఈ రఘునాథ్‌బాబుకు కళ్యాణదుర్గం రూరల్ సెక్షన్ పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించారు.

రావులుడికిలో గ్రామసభ


సమస్యలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి

పెద్దవడుగూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావులుడికి గ్రామంలో శనివారం నిర్వహించిన గ్రామసభలో ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి పాల్గొన్నారు. గ్రామసమస్యలపై ఆరాతీశారు. మురుగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, శ్మశానవాటిక, తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు కోరారు. ఇందులో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి, నాయకులు గంగరాజుయాదవ్, నాగేశ్వరరెడ్డి, చిరంజీవి, కృష్ణ, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

500 వీధిదీపాల అందజేత

రాయదుర్గం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): స్థానిక పురపాలక సంఘంలో వీధి దీపాలను విరాళంగా ఇచ్చి ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు గతంలో పిలుపునిచ్చారు. దీనికి స్పందించిన పలువురు వీధిదీపాలను విప్‌కు అందజేశారు. శనివారం సాయంత్రం గౌడ లేఔట్‌లో విరాళంగా అందిన రూ. 7.50 లక్షలు విలువచేసే 500 దీపాలను విప్ మున్సిపాల్టీకి అప్పగించారు. సమస్యలను విడతల వారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.


వీధిదీపాలను అందిస్తున్న ప్రభుత్వ విప్ కాలవ

క్రైం న్యూస్..

తిరుపతిలో యువకుడి మృతి


జాఫర్ (ఫైల్)

కళ్యాణదుర్గం , జూన్ 14(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన జాఫర్ (25) తిరుపతిలో గుండెపోటుతో శనివారం మరణించాడు. జాఫర్ తన కుటుంబ సభ్యులతో కలసి మూడు రోజుల క్రితం తిరుపతి వెళ్లారు. ఈ నేపథ్యంలో శనివారం కుటుంబ సభ్యులతో కలసి జాఫర్ తిరుపతి మెట్లు ఎక్కుతుండగా గుండెనొప్పి రావడంతో అపస్మారక స్థితిలో పడిపోయాడు. వెంటనే పోలీసులు తిరుపతిలోని సమీప ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే అతను మరణించినట్లు తెలిపారు. మృతుడికి వివాహం కాలేదు. తిరుపతి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ కిందపడి క్లీనర్ ...

తాడిపత్రి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని చుక్కలూరు సమీపంలో లారీక్లీనర్ సుబ్బారెడ్డి (58) లారీ ఎక్కుతూ స్లిప్ అయి టైరు కింద పడి మరణించాడు. కడప జిల్లా సింహాద్రిపురం మండలం అంకాలమ్మ గూడూరుకు చెందిన సుబ్బారెడ్డి లారీక్లీనర్. శుక్రవారం రాత్రి లారీ కాటా వద్దకు వెళ్లి తిరిగి వెళుతున్న సమయంలో క్లీనర్ లారీ ఎక్కుతూ కాలు జారి టైరు కిందపడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సుబ్బారెడ్డికి భార్య అనురాధ, కొడుకు వేణుగోపాల్‌రెడ్డి, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

అతిగా మద్యం సేవించి..

తాడిపత్రి, జూన్14(ఆంధ్రజ్యోతి): స్థానిక శివాలయం సమీపంలో పెద్దన్న (25) అతిగామద్యం సేవించి శనివారం మరణించాడు. స్థానిక హరిజనవాడకు చెందిన పెద్దన్న కుమారుడు పెద్దన్న అలియాస్ చిన్న జులాయిగా తిరుగుతూ దొంగతనాలకు పాల్పడేవాడు. అతను అవివాహితుడు. శనివారం అతిగా మద్యం తాగి మరణించాడు. కేసు దర్యాప్తులో ఉంది.

ఇద్దరికి గాయాలు

గుత్తి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జంగాల కాలనీ సమీపంలో జరిగిన రోడ్డుప్రమాదంలో తుగ్గలి మండలం మామిళ్ల పల్లి గ్రామానికి చెందిన మధు, శ్రీధర్ గాయపడ్డారు. వీరు బైక్‌లో రాయల్‌చెరువుకు వెళ్లి తిరిగి వస్తుండగా కుక్క అడ్డురావడంతో దాన్ని తప్పించబోయి కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దొంగల భయం

కళ్యాణదుర్గం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): చోళుల కాలం నాటి కంబదూరు మల్లేశ్వరస్వామి ఆలయానికి దొంగల భయం పట్టుకుంది. రెండు రోజుల క్రితం నలుగురు దొంగలు ఈ ఆలయంలోకి చొరబడేందుకు ప్రయత్నించారు. వాచ్‌మన్ గమనించి.. పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. దీంతో ఆ దొంగలు పారిపోయారు. పోలీసులు వచ్చి.. వారి కోసం గాలించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో పోలీసులు ప్రతిరోజు రాత్రి పూట ఆలయ చుట్టుపక్కల పరిసరాల్లో గస్తీ నిర్వహిస్తున్నారు.

జూదరుల అరెస్ట్

తాడిపత్రి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): స్థానిక చిన్నబజారులోని వాటర్ ట్యాంక్ సమీపంలో పేకాట (మంగపత్తు) ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ సాయిప్రసాద్ శనివారం తెలిపారు. వారి నుంచి రూ.51,750ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ గౌస్ బాషా సిబ్బంది పాల్గొన్నారన్నారు.

ఇంట్లో చోరీ

గుంతకల్లుటౌన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): స్థానిక హనుమేష్ నగర్‌లో నివాసముంటున్న రియల్ ఎస్టేట్ వ్యాపారి కే నారాయణ స్వామి ఇంట్లో చోరీ జరిగింది. ఆయన ఈనెల 6న ఇంటికి తాళం వేసి గుత్తిలో ఉండే బంధువుల ఇంటికి వెళ్లారు. దుండగులు నారాయణ స్వామి ఇంటి తలుపులు పగల గొట్టి బీరువాలోని రెండు జతల బంగారు కమ్మలు, మూడు గ్రాముల ఒక బంగారు డాలర్‌ను ఎత్తుకెళ్లారు. శనివారం నారాయణ స్వామి ఇంటి తలుపులు తెరచి ఉండటాన్ని ఎదురింటి వారు గమనించి.. ఫోన్ ద్వారా అతనికి సమాచారం అందించారన్నారు. ఈ విషయాన్ని నారాయణ స్వామి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు సీఐ మనోహర్ తెలిపారు.

పెద్దారెడ్డిని అడ్డుకున్న పోలీసులు


పెద్దారెడ్డిని అడ్డుకుంటున్న పోలీసులు

యల్లనూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని తాడిపత్రికి వెళ్లనీయకుండా పోలీసు అధికారులు తిమ్మంపల్లిలో మరోసారి అడ్డుకున్నారు. శనివారం ఉదయాన్నే పెద్దారెడ్డి తాడిపత్రికి వెళుతున్నారని సమాచారం పోలీసులకు రావడంతో అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పెద్దఎత్తున పోలీసులు ఆ గ్రామానికి చేరుకున్నారు. ఆయన ఇంటి నుంచి బయటకు వెళ్లే అన్ని మార్గాల్లో పోలీసు వాహనాలను అడ్డంగా ఉంచారు. 7గంటల సమయంలో పెద్దారెడ్డి ఇంటి వద్ద నుంచి బయటకు రావడానికి ప్రయత్నించినప్పుడు డీఎస్పీ వెంకటేశ్వర్లు, రూరల్ సీఐ సత్యబాబు, మరికొంతమంది పోలీసులు అడ్డుచెప్పారు. పోలీసులు ఇక్కడి నుంచి కదలకూడదంటూ నోటీసులు జారీచేయడంతో ఆయన వెనక్కి వెళ్లిపోయారు.

● పోలీసులు అలర్ట్ : పెద్దారెడ్డి తాడిపత్రి వస్తాడని తెలియడంతో శుక్రవారం రాత్రి పోలీసులు అలర్ట్ అయ్యారు. దాదాపు 300 మంది పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి ఇటు తాడిపత్రి అటు యల్లనూరు మండలం తిమ్మంపల్లి గ్రామాల్లో పర్యటించారు.

ఏడాదికే దెబ్బతిన్న తారు రోడ్డు


◄ దెబ్బతిన్న తారు రోడ్డు

కూడేరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కూడేరు నుంచి మరుట్ల 3వ కాలనీ వరకు దాదాపు రూ.6.40 కోట్ల నాబార్డ్ నిధులతో ఏడాది క్రితం రోడ్డు వేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయం కావడంతో కాంట్రాక్టర్ ఆ పనులు హడావుడిగా పనుల్లో నాణ్యత లేకుండా చేశారనే ఆరోపణలున్నాయి. అంతరగంగ గ్రామ సమీపంలో తారు రోడ్డు దెబ్బతింది.

ఆదుకున్న 'తల్లికి వందనం'


డి. హీరేహాళ్‌లో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న లక్ష్మీదేవి, వారి పిల్లలు, నాయకులు

● ఒకే కుటుంబంలో ఐదుగురికి..

డీ. హీరేహాళ్, జూన్14(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీదేవి, కృష్ణకు ఐదుగురు పిల్లలు. మొదటి కూతురు లక్ష్మి ఇంటర్ ప్రథమ సంవత్సరం, రెండో కూతురు శైలజ 10వ తరగతి, కుమారుడు పవన్ 7వ తరగతి, అంజలి 6వ తరగతి, దీక్షిత 4వ తరగతి చదువుతున్నారు. వారి ఖాతలోకి తల్లికి వందనం పథకం కింద రూ. 65 వేలు శనివారం జమ అయింది. ఆరేళ్ల క్రితం కృష్ణ ప్రమాదవశాత్తు మరణించాడు. అప్పటి నుంచి ఆ పిల్లలు భారం లక్ష్మీదేవిపై పడింది. ఆమె కూలి పనులకు వెళ్తూ పిల్లలను చదివించేది. ఇలాంటి సమయంలో రూ. 65 వేలు జమకావడంతో ఆమె స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద నాయకులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.


జుంజరాంపల్లిలో ఐదుగురు పిల్లలతో తల్లి నాగేంద్రమ్మ

రాయదుర్గంరూరల్: మండలంలోని జుంజరాంపల్లిలో గ్రామంలో జి. నాగేంద్రమ్మ, హనుమంతప్ప దంపతుల ఐదుగురు పిల్లలకు తల్లికి వందనం సొమ్ము వారి ఖాతాలో రూ. 65 వేలు శనివారం జమ అయింది. తేజ 9వ తరగతి, లక్ష్మి 7వ తరగతి, రాజేష్ 6వ తరగతి, శిష 3వ తరగతి, శివమణి 3వ తరగతి చదువుతున్నారు.

● ఒకే కుటుంబంలో నలుగురికి...


ఉద్దేహాళ్‌లో నలుగురు పిల్లలతో ప్రమీల, రామాంజి

బొమ్మనహాళ్ : మండలం ఉద్దేహాళ్ గ్రామానికి చెందిన ప్రమీల, రామాంజి దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. వీరంతా ఉద్దేహాళ్‌లోని ప్రభుత్వ పాఠశాలలో 9, 8, 6, 4 తరగతులు చదువుతున్నారు. రామాంజి వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ పిల్లలు ఒక్కొక్కరికి రూ. 13 వేల చొప్పున మొత్తం రూ. 52 వేలు తల్లి ఖాతాలో శనివారం జమ అయింది.


కెంచానపల్లిలో నలుగురు పిల్లలతో దాదావలి, చాంద్‌బీ

రాయదుర్గంరూరల్:మండలంలోని కెంచానపల్లి గ్రామానికి చెందిన దాదావలి, చాంద్‌బీ దంపతులకు నలుగురు సంతానం. రోజాబి ఇంటర్, ఆశాబీ 8వ తరగతి, వన్నూరు 7వ తరగతి, శర్మస్వామి 5వ తరగగతి చదువుతున్నారు. ఈ నలుగురు పిల్లలకు సంబంధించిన మొత్తం రూ. 52 వేలు శనివారం తల్లి ఖాతాలో జమ అయింది.


కడవకల్లులో నలుగురు కుమార్తెలతో భూలక్ష్మి

పుట్లూరు : మండలంలోని కడవకల్లులో నివాసముంటున్న సురేంద్ర, భూలక్ష్మిలకు నలుగురు కుమార్తెలు. సిరిమల్లి 8వ తరగతి, శ్రీభారతి 5వ తరగతి, శ్రీభార్గవి 5వ తరగతి, ఆపరూప సంగీత 2వ తరగతి చదువుతున్నారు. సురేంద్ర కూలిపనులకు వెళ్లి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నలుగురు పిల్లలకు రూ. 52 వేలు తల్లికి వందనం పథకం కింద శనివారం జమ అయింది.

విడపనకల్లు : మండలంలోని పాల్తూరు గ్రామంలో నివాసముంటున్న గంగన్న, చౌడికి వంద్రక్క దంపతులకు నలుగురు సంతానం. రామ్‌చరణ్ 10వ తరగతి, ఉపేంద్ర 7వ తరగతి, సాయికిరణ్ 5వ తరగతి, స్నేహలత 3వ తరగతి చదువుతున్నారు. దంపతులు కూలిపనులకు వెళ్లి.. కుటుంబాన్ని పోషించుకునే వారు. కాగా, ఈ నలుగురు పిల్లలకు ఒక్కొక్కరికి రూ. 13 వేల చొప్పున మొత్తం రూ. 52 వేలు తల్లి ఖాతాలో శనివారం జమ అయింది.


నలుగురు పిల్లలతో చౌడికి వంద్రక్క, గంగన్న


ఉరవకొండలో తల్లికి వందనం పథకం లబ్ధిదారులు, టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి పయ్యావుల కేశవ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.


కణేకల్లులో చంద్రబాబు, నారా లోకేశ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు, టీడీపీ నాయకులు


తాడిపత్రి మండలం గన్నెవారిపల్లి కాలనీలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చింబిలి వెంకటరమణ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు